జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన

నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?

మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది

వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 6 సంచిక 21 | హైదరాబాద్, నవంబరు 16 బుధవారం 2022 | 8 పేజీలు | వెల : 5.00

# ముందస్తు ప్రసక్తే లేదు

## షెడ్యూల్ ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలు : సీఎం కేసీఆర్



హైదరాబాద్ : టీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికలపై స్పష్టత ఇచ్చారు. షెడ్యూల్ ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని స్పష్టం చేశారు. ముందస్తు ఎన్నికలకు వెళ్లే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. పార్టీ శ్రేణులంతా ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు సీఎం కేసీఆర్ అధ్యక్షతన ప్రారంభమైన ఈ సమావేశంలో అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధతతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశంపై చర్చించారు.

**ఎమ్మెల్యేలను మార్చే ప్రసక్తే లేదు..**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలను మార్చే ప్రసక్తే లేదని కేసీఆర్ స్పష్టం చేశారు. మళ్లీ పాత వారికే టికెట్లు ఇస్తామని పేర్కొన్నారు. ఎన్నికలకు పది నెలల సమయమే ఉంది. పార్టీ శ్రేణులంతా ఎన్నికలకు సిద్ధం కావాలి. ప్రతి ఎమ్మెల్యే నిత్యం ప్రజలతో మాట్లాడాలి అని సూచించారు.

(మిగతా 2లో..)

# టాలీవుడ్ 'సూపర్ స్టార్' ఇక లేరు

## కృష్ణ మృతిపట్ల పలువురు సంతాపం

హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి: తెలుగు సినీ చరిత్రలో ఆయన ఓ ట్రెండ్ సెట్టర్. సాహస సినిమాలకు కేరాఫ్. అందుకే టాలీవుడ్ సూపర్ స్టార్ అయ్యారు కృష్ణ. నటుడిగా సినీ ప్రస్థానం మొదలుపెట్టి దర్శకుడిగా, నిర్మాతగా ఎన్నో సినిమాలు తీశారు. ఫిల్మ్ స్టూడియో నిర్మించి.. ఎన్నో సినిమాలకు ప్రాణం పోశారు. భారతీయ సినిమా రంగంలో లెజెండ్ అనిపించుకున్నారు. తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయారు. ఆదివారం అర్ధరాత్రి కార్డియాక్ అరెస్టుకు గురైన కృష్ణను కుటుంబసభ్యులు గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తెల్లవారుజామున ఆయన తుదిశ్వాస విడిచారు. కృష్ణ మృతితో ఆయన కుటుంబసభ్యులతో పాటు అభిమానులు, తెలుగు సినీలోకం శోకసంద్రంలో మునిగిపోయింది.

**మంచి మిత్రున్ని కోల్పోయా : కేసీఆర్**

కృష్ణతో ఉన్న సానిహిత్యాన్ని గుర్తుచేసుకున్నారు సీఎం కేసీఆర్. వ్యక్తిగతంగా మంచి మిత్రున్ని కోల్పోయానని చెప్పారు. కృష్ణ నటించిన అల్లూరి సీతారామరాజు చిత్రాన్ని ఎన్నోసార్లు చూశానని తెలిపారు . కృష్ణ



ముక్కుసూటి మనిషని కీర్తించారు. అధికార లాంఛనాలతో కృష్ణ అంత్యక్రియలు నిర్వహిస్తామని వెల్లడించారు. (మిగతా 2లో..)

# తెలంగాణకు వైద్య కవచం కావాలి

## చరిత్రలో తెలంగాణ కు ఇది కొత్త అధ్యాయం

## రాష్ట్రంలో 8 కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభం

## ఎంబీబీఎస్ క్లాసులను వర్చువల్‌గా ప్రారంబించిన సీఎం

**( గతంలో తాగునీటికి, సాగునీటికి, మెడికల్ సీటుకి, ఇంజినీరింగ్ సీటుకు ఎన్నో రకాల అవస్థలు పడ్డాం. స్వ రాష్ట్రంగా తెలంగాణ ఏర్ప డటంతో ఇప్పుడు అద్భు తంగా, ఆత్మగౌరవంతో బతుకుతున్నాం: ముఖ్య మంత్రి కేసీఆర్.)**





హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 15, ప్రజాపాలన :తెలంగాణ వైద్యవిద్యలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. జిల్లాకో వైద్యకళాశాలను ఏర్పాటు చేయాలనే ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం సాకారమయ్యే దిశగా కీలక ముందడుగు పడింది. ఒకే ఏడాది ఎనిమిది ప్రభుత్వ వైద్య కళాశాలలు అందుబాటులోకి వచ్చాయి. మంగళవారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన కార్యక్రమం ద్వారా నూతన వైద్య కళాశాలల్లో ఏకకాలంలో రాష్ట్రంలో ఎనిమిది వైద్య కళాశాల లో తరగతులను ముఖ్యమంత్రి కేసీఆర్ వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో సంగారెడ్డి, మహబూబాబాద్, మంచిర్యాల, జగిత్యాల, వనపర్తి, కొత్తగూడెం, నాగర్‌కర్నూల్, రామగుండం వైద్య కళాశాలల్లో 2022-23 వైద్యవిద్య సంవత్సరం నుంచే ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభమైనట్లు అయింది. వీటి ద్వారా 1,150 సీట్లు విద్యార్థులకు కొత్తగా అందుబాటులోకి వచ్చాయి. దీంతో రాష్ట్రంలో వైద్యవిద్య కళాశాలల సంఖ్య 17కి చేరింది. సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడారు. తెలంగాణకు ఇది సువర్ణాధ్యాయమని మరిచిపోలేని రోజు అని చెప్పారు. (మిగతా 2లో..)

# దేశంలో పరిశోధన నాణ్యత పెరగాలి

## భారత్‌లో తయారైన దగ్గు సిరప్ కారణంగా గాంబియాలో 66 మంది పిల్లలు మృతి చెందడం భారత్‌కు తలవంపు..: ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి



హైదరాబాద్, దేశంలో పరిశోధనల నాణ్యత పెరగాల్సిన అవసరం ఉందని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నారాయణ మూర్తి పేర్కొన్నారు. భారత్‌లో తయారైన దగ్గు సిరప్ కారణంగా గాంబియాలో 66 మంది పిల్లలు మృతి చెందడం భారత్‌కు తలవంపు తెచ్చిందన్నారు. బెంగళూరులోని ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్‌లో ఇన్ఫోసిస్ సైన్స్ ప్రైజ్ విజేతలను ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ.. అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరాలని ఆకాంక్షిస్తున్న భారత్ శాస్త్ర పరిశోధనల్లో మరింత పురోగతి సాధించాల్సి అవసరం ఉందన్నారు. భారతీయ పరిశోధకుల అత్యుత్తమ పరిశోధన ప్రయత్నాలను గుర్తించడం, తగిన ప్రతిఫలమివ్వడం అవసరమన్నారు. రెండు భారతీయ కంపెనీలు కోవిడ్ వ్యాక్సిన్‌లను కోట్ల మందికి అందించినప్పటికి, ఎంతో మంది భారతీయులు శాస్త్ర, సాంకేతిక, పరిశోధన రంగంలో ప్రతిష్టాత్మకమైన అవార్డులు పొందారని, ఎంతో గుర్తింపును తెచ్చుకున్నారని అయితే ఇంకా చాలా సవాళ్లు ఉన్నాయన్నారు. అనేక వ్యాధులకు భారత్ ఇంకా టీకాలను అభివృద్ధి చేయలేదన్నారు. పరిశోధనలు విజయవంతమవడానికి రెండు అంశాలు కీలక పాత్ర పోషిస్తాయని, డబ్బు అత్యంత ముఖ్యమైనది మాత్రం కాదన్నారు.పాఠశాలల్లో, కళాశాలల్లో బోధనా విధానం విద్యార్థుల మెదడుకు పదునుపెట్టే విధంగా ఉండాలన్నారు. తరగతిగదిలో విద్యార్థులు నేర్చుకున్నది కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం కంటే చుట్టూ ఉన్న వాస్తవాలను ప్రపంచానికి తెలియజేసేలా బోధన ఉండాలన్నారు.రెండొవది పరిశోధకుల తక్షణ సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించాలన్నారు. 2022లో వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో టాప్ 250లో ఒక్క భారతీయ ఉన్నత విద్యా సంస్థ కూడా లేదనే విషయాన్ని నారాయణమూర్తి తెలిపారు. కాగా ఆరు విభాగాల్లో ఇన్ఫోసిస్ సైన్స్ ప్రైజ్‌లను ఆయన ప్రకటించారు.



## బీజేపీపై రాహుల్ గాంధీ ఫైర్

బిర్సా ముండా సిద్ధాంతంపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాడి చేస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. గిరిజనుల పేరును ఆదివాసీ నుంచి వనవాసీగా మార్చటం వెనుక బీజేపీ కుట్ర ఉందన్నారు. ఆదివాసీల హక్కులను బీజేపీ లాక్కుంటుందన్నారు మండిపడ్డారు. మహారాష్ట్రలోని హింగోలిలో భారత్ జోడోయాత్రలో రాహుల్ మాట్లాడారు.కాగా, కాంగ్రెస్ చేపట్టిన భారత్ జోడో యాత్ర మహారాష్ట్రలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా అక్కడి వశీమ్ నగరంలో నిర్వహించిన బిర్సా ముండా జయంతి వేడుకకు రాహుల్ గాంధీ హాజరయ్యారు. ఆదివాసీలు వినియోగించే ధనస్సుతో బాణాన్ని వదిలి పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు.

## భారతీయ మూలాలు గలవారి

# విజయాలు గర్వకారణం

### మంగళవారం భారతసంతతి ప్రజలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ



బాలి (ఇండోనేషియా) : భారతీయ మూలాలుగలవారి విజయాలు గర్వకారణమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. భారత దేశం, ఇండోనేషియా మధ్య అనుబంధం ఉమ్మడి సంస్కృతి, వారసత్వాలకు సంబంధం చినదని తెలిపారు. జీ20 సదస్సు కు హాజరైన ఆయన మంగళవారం భారత సంతతి ప్రజలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఇండోనేషియాలోని భారత సంతతి ప్రజలు మోదీకి ఘన స్వాగతం పలికారు. 'మోదీ, మోదీ' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మోదీ ఇండోనేషియా సంప్రదాయ వాద్య పరికరాలను వాయించారు.మోదీ మాట్లాడుతూ, "బాలీలో నేను మీతో మాట్లాడుతున్న సమయంలో, ఇక్కడికి 1,500 కిలోమీటర్ల దూరంలో భారత దేశంలో ఉన్న కటక్‌లో బాలి యాత్ర మహోత్సవం జరుగుతోంది" అని చెప్పారు. భారత్–ఇండోనేషియా వ్యాపార సంబంధాలకు వేలాది సంవత్సరాల చరిత్ర ఉందని, దానిని గుర్తు చేసుకుంటూ ఉత్సవాలను జరుపుకుంటున్నామని తెలిపారు.

## నిర్మల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ కారు జప్తు



ఆదిలాబాద్ :నిర్మల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ వాహనాన్ని కోర్టు సిబ్బంది జప్తు చేశారు. సీనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు అడిషనల్ కలెక్టర్ ఉపయోగిస్తున్న ఇన్నోవా కారు (నెంబరు టీఎస్ 18 6446) ను మంగళవారం సీజ్ చేశారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు కింద ముంపునకు గురైన రైతులు పరిహారం కోసం కోర్టును ఆశ్రయించారు. నర్సాపూర్ జి మండలం బామిని గ్రామస్థులు తమకు ముంపు పరిహారం ఇంకా రూ.21 లక్షలు చెల్లించాలని కోర్టును ఆశ్రయించారు. పరిహారం చెల్లింపు విషయంలో ఆలస్యం కావడంతో న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఇవాళ జప్తు చేశారు. గతంలో కూడా ఎస్పారెస్పీ ముంపు పరిహారం అందించడంలో ఆలస్యం చేసినందుకు కలెక్టరేట్ లోని సామగ్రిని కోర్టు జప్తు చేసింది. ఇప్పుడు మరోసారి అడిషనల్ కలెక్టర్ కారును జప్తు చేశారు.



# టాలీవుడ్ 'సూపర్ స్టార్' ఇక లేరు

(మొదటిపేజీ తరువాయి)

**కృష్ణ భౌతికకాయానికి సీఎం కేసీఆర్ నివాళులు**

సూపర్ స్టార్ కృష్ణ భౌతికకాయానికి సీఎం కేసీఆర్ నివాళులు అర్పించారు. అనంతరం మహేష్ బాబుతో పాటుగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. కేసీఆర్ వెంట మంత్రులు హరీష్, పువ్వాడ ఉన్నారు.

**నేడు మధ్యాహ్నం కృష్ణ అంత్యక్రియలు**

సూపర్ స్టార్ కృష్ణ అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. నేడు మధ్యాహ్నం మహాప్రస్థానంలో కృష్ణ అంత్యక్రియలు జరగనున్నాయి. అభిమానుల సందర్శనార్థం ఇవాళ సాయంత్రం గచ్చిబౌలి స్టేడియానికి పార్థివదేహాన్ని తరలించనున్నారు. నేడు ఉదయం పార్థివదేహాన్ని పద్మాలయ స్టూడియోస్ కు తరలిస్తారు.

**ప్రజల హృదయాలను గెలుచుకున్న ఒక లెజండరీ : మోడీ**

కృష్ణ గారు తన అద్భుత నటనా కౌశలంతో, ఉన్నతమైన, స్నేహపూర్వకమైన వ్యక్తిత్వంతో ప్రజల హృదయాలను గెలుచుకున్న ఒక లెజెండరీ సూపర్?స్టార్. ఆయన మృతి సినీ ప్రపంచానికి తీరని లోటు. ఈ విషాదకర సమయంలో వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. ఓం శాంతి

**కృష్ణాజీ మరణవార్త విషయం నన్నెంతో బాధించింది : రాహుల్‌గాంధీ**

తెలుగు సినిమా సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణాజీ మరణవార్త విషయం నన్నెంతో బాధించింది. వృత్తిపట్ల ఆయనకున్న నిబద్ధత, విలువలు ప్రజలకు ఆదర్శం. ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా" కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ

**మా కుటుంబానికి తీరని లోటు : ఘట్టమనేని కుటుంబం**

మా కుటుంబానికి కృష్ణ గారి మృతి తీరనిలోటు. కేవలం వెండితెరపైనే కాదు, ప్రేమ, మానవత్వం, ఆప్యాయత పంచడంలోనూ ఆయన సూపర్‌స్టారే. ఆయన చేసిన ఎన్నో మంచి పనులు ద్వారా మన మధ్య జీవించే ఉంటారు. అన్నింటికన్నా మిన్నగా మమ్మల్ని ప్రేమించారు. ఇక ప్రతి రోజూ ఆయన్ని కోల్పోయిన భారంతోనే గడుపుతాం ఘట్టమనేని కుటుంబం.

**ఒక అద్భుత సినీశకం ముగిసినట్లయింది : చంద్రబాబు**

తెలుగు సినీ పరిశ్రమలో మంచి మనిషిగా, నిర్మాతల హీరోగా, నటశేఖరుడిగా, సూపర్‌స్టార్ గా పిలిపించుకున్న నటులు, మాజీ ఎంపీ కృష్ణ గారి మరణం దిగ్భ్రాంతికి గురిచేసింది. నటుడిగా, దర్శకుడిగా, తెలుగు సినిమాకు తొలి సాంకేతికతను అద్దిన సాహసనిర్మాతగా కృష్ణగారిని చెప్పుకుంటారు. కృష్ణగారి మరణంతో ఒక అద్భుత సినీశకం ముగిసినట్లయింది. ఇటీవలే తల్లిని, ఇప్పుడు తండ్రిని కూడా కోల్పోయిన మహేష్ బాబుకు ఇది తీరని వేదన. ఈ బాధ నుంచి త్వరగా కోలుకునే మనోధైర్యాన్ని ఆయనకు ఇవ్వాలని భగవంతుని కోరుకుంటూ.. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

**వైఎస్ జగన్ సంతాపం**

సూపర్ స్టార్ కృష్ణ మృతి పట్ల ఏపీ సీఎం వైఎస్ జగన్ సంతాపం ప్రకటించారు. ఆంధ్రా జేమ్స్ బాండ్‌గా ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నారని జగన్ అన్నారు. అల్లూరి సీతారామరాజు సినిమాలో అల్లూరి పాత్రలో ఆయన ఎంతో అద్భుతంగా నటించారని సీఎం గుర్తు చేసుకున్నారు. మహేష్ బాబు కుటుంబ సభ్యులకు జగన్ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

**వెండి తెరకు ప్రాణం పోసిన గొప్ప వ్యక్తి కృష్ణ : హరీశ్ రావు**

వెండి తెరపై "సూపర్ స్టార్" గా వెలుగొందిన హీరో కృష్ణ గారి మృతి బాధాకరం. ఒక సామాన్యుడిగా తన జీవితాన్ని ప్రారంభించి, ఒక సినీ శక్తిగా మారి, పరిశ్రమలో "సూపర్ స్టార్ " గా ఎదిగిన కృష్ణ గారి మృతి పట్ల సంతాపం ప్రకటిస్తున్నాను. నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా.. అల్లూరి సీతారామరాజు, కౌబాయ్, జేమ్స్ బాండ్ లాంటి ప్రయోగాలకు శ్రీకారం చుట్టి తెలుగు సినిమా స్థాయిని పెంచి, వెండి తెరకు ప్రాణం పోసి, సినీ అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప వ్యక్తి కృష్ణ.. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్న.

# తెలంగాణకు వైద్య కవచం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

వైద్య విద్యార్థులు, వైద్యశాఖ అధికారులు, జిల్లా కలెక్టర్లు, వైద్య కళాశాలల నిర్వాహకులకు సియం శుభాకాంక్షలు తెలిపారు. "గతంలో తాగునీటికి, సాగునీటికి, మెడికల్ సీటుకి, ఇంజినీరింగ్ సీటుకు ఎన్నో రకాల అవస్థలు పడ్డాం. స్వరాష్ట్రంగా తెలంగాణ ఏర్పడటంతో ఇప్పుడు అద్భుతంగా, ఆత్మగౌరవంతో బతుకుతున్నామని ,. దేశానికే మార్గదర్శకమైన అనేక వినూత్న కార్యక్రమాలు చేపడుతూ ముందుకెళ్తున్నాం అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఎనిమిది ప్రభుత్వ వైద్యకళాశాలలు ప్రారంభించుకోవడం చాలా గర్వకార ణంగా ఉందన్న సియం మహబూ బాబాద్, వనపర్తిలాంటి మారుమూల ప్రాంతాల్లో వైద్యకళాశాలల వస్తాయని ఎవరూ కలలో కూడా ఊహించి ఉండరని అన్నారు. దీనికి కారణం సొంత రాష్ట్రం ఏర్పాటు, ఉద్యమకారులుగా ఉన్నవారే పరిపాలనా సారథ్యాన్ని స్వీకరించడం అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు హరీశ్‌రావు వైద్యఆరోగ్యశాఖ నిర్వహించడమే ఇందుకు కారణం అని ,వైద్యకళాశాలల ఏర్పాటు విషయంలో మంత్రి హరీశ్ కృషిని సియం అబినందించారు.

**వైద్య వ్యవస్థ పటిష్ఠంగా ఉన్నచోట నష్టం తక్కువ**

ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజ్ రావాలని సంకల్పించుకున్నాం. ఇప్పుడు ప్రారంభించిన వాటితో కలిపి ప్రభుత్వ రంగంలో వైద్య కళాశాల సంఖ్య 17కు పెరిగింది. మరో 17 జిల్లాల్లోనూ రావాల్సి ఉంది. అవి కూడా ఏర్పాటు చేస్తాం. గతంలో మనకు ప్రభుత్వ వైద్య కాలేజీల్లో 850 సీట్లు మాత్రమే ఉండేవి.. ఇప్పుడు ఆ సంఖ్య 2,790కి చేరింది. పీజీ సీట్లు, సూపర్‌స్పెషాలిటీ సీట్లు గణనీయంగా పెంచుకోగలిగాం. వైద్య సదుపాయాలు కొరవడి కొవిడ్ వేళ ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది మరణించారు. అమెరికాలోనూ వైద్య సదుపాయాలు సరిపోక చనిపోయారు. వైద్య వ్యవస్థ పటిష్ఠంగా ఉన్నచోట నష్టం తక్కువగా ఉంటుంది. కొవిడ్ లాంటి మహమ్మారులు, ఇతర వైరస్‌ల బెడద రాకూడదు. వైద్య విద్యార్థులతో రాష్ట్రానికి వైద్య కవచం నిర్మించుకుంటున్నాం" అని కేసీఆర్ అన్నారు. మంచిర్యాల ప్రభుత్వం వైద్య కలాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ భారతీ హొళ్ళికేరీ ,జడ్పీ చైర్మన్ నల్లాల బాగ్యలక్ష్మీ , మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య , మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలు , వైద్యులు, వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# భూ కబ్జాదారులపై తక్షణమే చర్యలు తీసుకోండి: ప్రభుత్వానికి రమణయ్య డిమాండ్

మేడ్చల్ (ప్రజా పాలన ప్రతినిధి ): మేడ్చల్ జిల్లా బాలనగర్ మండలం హనుమంత్ పేట గ్రామంలో సర్వేనెంబర్ 31, 32, 57,లో గల 274 ఎకరాల సర్కారు స్థలమును దళితులకు ఒక్కరికి 80 గజాల చొప్పున 200 మందికి ఎస్సీ ఎస్టీలకు తహసిల్దార్ కేటాయించారని దళిత మహిళా మండలి గౌరవ సలహాదారు టి రమణయ్య చెప్పారు. సోమాజిగూడ విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ వాళ్లు ప్రగతి నగర్ మినీ ట్యాంక్ బండ్ చెరువు వద్ద భారీ గేట్లు కడితే మండల రెవెన్యూ సిబ్బంది వచ్చి వాటిని కూలగొట్టడం జరిగిందని రమణయ్య చెప్పారు. ఈటల రాజేందర్ సమీప బంధువులు రాములు, పురుషోత్తం, సహదేవ్, వెమ్మారెడ్డి, జగదీష్, శ్రీశైలం,




రామకృష్ణ, బాలానగర్ ఎమ్మార్వో రత్నకుమార్ కు లక్షల రూపాయలు ఇచ్చి 274 ఎకరాల స్థలమును కబ్జా చేశారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఎమ్మార్వో రత్నకుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆయన తెలిపారు 2001 వ సంవత్సరంలో బాలనగర్ మండలంలో భూకబ్జాదారులతో కుమ్మక్కై వందల ఎకరాలు అన్యాక్రాంతం చేశారని ఆయన ఆరోపించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి 200 మందికి ఎస్సీ ఎస్టీలకు ప్రతి ఒక్కరికి 80 గజాల చొప్పున భూమి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారని ఆయన తెలిపారు శివమ్మ కాలనీ తమ దళిత మహిళలకు కేటాయించిన స్థలం 7 ఎకరాలు, శ్రీరాంనగర్ అంబీర్ చెరువు శిఖం 8 ఎకరాలు, దత్తాత్రేయ కాలనీ 13 ఎకరాలు కబ్జా చేశారని ఆయన ఆరోపించారు. ఈ విషయమై సుప్రీంకోర్టుకు హైకోర్టుకు వెళ్లడం జరిగిందని మానవ హక్కుల కమిషనర్ కు ఫిర్యాదు చేశామని మా పోరాటాల ఫలితంగా సీఎం కేసీఆర్ దళిత మహిళలకు స్థలాలు ఇవ్వడం అభినందనీయమని హైకోర్టు న్యాయమూర్తి కి మానవ హక్కుల చైర్మన్ కి సుప్రీంకోర్టు మాజీ సిజెఐ ఎస్ వి రమణకు దళిత మహిళా మండలి సలహాదారు టి రమణయ్య ముఖ్యమంత్రికి కేటీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి కెసిఆర్ కు తాము ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని అన్నారు80 గజాల ఫ్లాటును 30 లక్షల రూపాయలకు అమ్ముతున్నారు అని ఆయన ఆరోపించారు

తాము ఈ విషయమై ఎస్సీ కమిషనర్ కి మహిళా కమిషనర్ కి ఈ భూ కబ్జాదారుల మీద కూకట్ పల్లి పోలీస్ స్టేషన్లో, జగదిరిగుట్ట పోలీస్ స్టేషన్లో,కేసులు పెట్టిన పోలీసు వారికి లంచాలు ఇచ్చుకుంటూ భూ కబ్జాదారులు కేసులు మాఫీ చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు . ఈ సందర్భంగా దళిత మహిళా అధ్యక్షురాలు ఎం పద్మ, దళిత మహిళా సెక్రటరీ టి జయమ్మ ముఖ్యమంత్రి కె సి ఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## సూపర్ స్టార్ కృష్ణ మృతి పట్ల కాంగ్రెస్ సంతాపం



మధిర నవంబర్ 15 (ప్రజా పాలన ప్రతినిధి) నాలుగు దశాబ్దాల సినిమా జీవితంలో నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా ఒక సాహసవంతమైన ప్రయాణం చేసిన సూపర్ స్టార్ కృష్ణ మృతికి మధిర మండల కాంగ్రెస్ కమిటీ తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కృష్ణ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సూచనల మేరకు 1984లో కృష్ణ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1989లో హస్తం పార్టీ తరపున ఏలూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 1991 ఎన్నికల్లో మరోసారి ఏలూరు నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత రాజీవ్ గాంధీ హత్యకు గురవడం ఏలూరులో ఓటమితో కృష్ణ ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నా కాంగ్రెస్ పార్టీకి అభిమానిగా ఉన్నారని వారు గుర్తు చేశారు. సూపర్ స్టార్ కృష్ణ మరణం తెలుగు వారికి మరియు చిత్ర పరిశ్రమకు తీరని లోటన్నారు. సంతాపం తెలిపిన వారిలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా బాలరాజు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అద్దంకి రవికుమార్ సైదల్లిపురం సర్పంచ్ పులిబండ్ల చిట్టిబాబు మాజీ సర్పంచ్ కర్నాటి రామారావు, నిడమనూరు వంశీ సూర్యదేవర కోటేశ్వరరావు వుట్ల రాంబాబు పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జహంగీర్ కర్లపూడి వాసు ఎడ్లపల్లి శ్రీనివాసరావు ఉషా భాస్కరరావు తదితరులు ఉన్నారు.

## దళిత బంధు పథకం ద్వారా లబ్ధిదారులు అభివృద్ధి చెందాలి

**అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క**



బోనకల్, నవంబర్ 15 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలోని పెద్ద బీరవల్లి గ్రామానికి చెందిన దేగల వేలాద్రి, గొర్రె ముచ్చు ఆనందరావు లకు స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క చొరవతో దళిత బంధు పథకం ద్వారా యూనిట్లు మంజూరు కాగా లబ్ధిదారులకు ఖమ్మం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో మంగళవారం భట్టి విక్రమార్క సతీమణి మల్లునందిని ని,కలిసి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేసి దళిత బందు పథకం ద్వారా వారు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో, చిన్నబిరల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బాలరాజు, ఎస్ కే బడే, యువజన కాంగ్రెస్ నాయకులు ఉమ్మినేని రమేష్, కుమార్, పిల్లి రాహుల్ ,పండు ,అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## పి డి ఎస్ యూ, రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయండి

**రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రాజేష్**




చేవెళ్ల నవంబర్ 15 (ప్రజాపాలన):ప్రగతిశిల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి డి ఎస్ యూ తెలంగాణ రాష్ట్ర 22వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మహాసభల పోస్టర్లను రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రాజేష్, చేవెళ్ల డివిజన్ నాయకులతో కలిసి రిలీజ్ చేయడం జరిగింది. పి డి ఎస్ యు తెలంగాణ రాష్ట్ర 22వ మహాసభలు డిసెంబర్ 1,2,3, న నిజామాబాద్ లో జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 సంవత్సరాలనుండి విద్యార్థుల నాణ్యమైన హక్కుల డిమాండ్ సాధన కోసం విద్యారంగా సమస్యలను పరిష్కరించాలని అందరికి ఉచిత నాణ్యమైన శాస్త్రీయమైన విద్యాకావాలని కామన్ విద్యావిధానం కోసం పోరాడుతుంది. ఉస్మానియా యూనివర్సిటీలో పురుడుపోసుకున్నటువంటిపి డి ఎస్ యూ, దేశంలో రాష్ట్రంలో విద్యారంగా అభివృద్ధి కోసం పోరాడుతూ సమాజ మార్పు కోసం నిరంతరం పరితపిస్తుంది. రోజురోజుకు విద్యా విధానం సంతలో సరుకులాగా మార్పు చెందుతూ కార్పొరేట్ కబంధహస్తాల్లో కురుకుపోతున్నాటువంటి పరిస్థితి ఉంది. పేదవాళ్ళు చదువుకున్నటువంటి ప్రభుత్వ రంగ విద్యాసంస్థలను ప్రభుత్వం పట్టించుకోవడంలో విఫలం అవుతుంది. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైనటువంటి ఉచిత నిర్బంద విద్యాహక్కులను ప్రభుత్వమే ఉచితంగా అందించాలని అందుకోసం భవిష్యత్తులో పి డి ఎస్ యూ నిర్వహించే పోరాటాలకు ఈ మహాసభ వేదిక కానుంది కాబట్టి విద్యార్థులు మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు కొజ్జెంకి జైపాల్, కార్యదర్శి బొజ్జి శ్రీకాంత్, సురేష్, అశోక్ లు ఉన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించాలి



పాలేరు నవంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధినేలకొండపల్లి: ప్రవేట్ టీచర్స్ సమస్యల పట్ల ప్రభుత్వం వెంటనే స్పందించాలని ప్రవేట్ టీచర్స్ ఫోరమ్ పాలేరు డివిజన్ అధ్యక్షుడు సాగర్ డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తకొత్తూరు ఓ ప్రవేట్ పాఠశాలలో మంగళవారం సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రవేట్ టీచర్స్ ఎదుర్కొంటున్న పలు సమస్యల ను పరిష్కరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. తమ పట్ల నిర్లక్ష్యం వీడాలని సూచించారు. ఈ నెల 20 న ఖమ్మం లో జరిగే విద్యా సేవా పురష్కార అవార్డుల కార్యక్రమం ను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం విద్యా సేవా పురష్కార్ కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు శ్రీనివాస్, వెంకట్, జానీ, శ్రీను, సుందర్, శ్రీకాంత్, –బాలాజీ, అంజయ్య, శ్రీదేవి, భవాని, సునీత, హైమాబాయి, సింధు, రమ్యశ్రీ.. వీరకుమారి. ప్రతిభ రేణుక, సునీత దివం. మమత తదితరులు పాల్గొన్నారు

## రవీంద్ర ప్లే స్కూల్లో అంబరాన్నంటిన బాలల దినోత్సవ వేడుకలు



జగిత్యాల, నవంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల పట్టణంలోని స్థానిక రెడ్డి ఫంక్షన్ హాల్ లో రవీంద్ర ప్లే స్కూల్ వారి బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పాఠశాల నిర్వాహకులు మరియు డైరెక్టర్స్ జ్యోతి ప్రచురణలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు మరియు వివిధ దేవతలు స్వాతంత్ర సమరయోధులు మరియు కార్టూన్ పక్షులు, జంతువుల వంటి వివిధ వేషధారణలు మరియు చిన్నారులు రోడ్ సేఫ్టీ మరియు రైతు ప్రాముఖ్యతను గురించి చేసిన నాటికలు పోషకులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు బి. శ్రీధర్ రావు, బి. హరిచరణ్రావు, కే. సుమన్ రావు కే. కిషన్లతో పాటు పోషకులు ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ముందస్తు ప్రసక్తే లేదు

(మొదటిపేజీ తరువాయి)

ఏవైనా సమస్యలుంటే ప్రభుత్వం దృష్టికి తేవాలని కేసీఆర్ సూచించారు.

వంద శాతం మళ్లీ టీఆర్ఎస్‌దే అధికారం..

సర్వేలన్నీ టీఆర్ఎస్‌కే అనుకూలంగా ఉన్నాయని కేసీఆర్ స్పష్టం చేశారు. వంద శాతం మళ్లీ టీఆర్ఎస్‌దే అధికారమని తేల్చిచెప్పారు. మునుగోడు తరహాలో పటిష్ట ఎన్నికల వ్యూహం తయారు చేయాలని పిలుపునిచ్చారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బాగా పని చేయాలి. అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. లబ్దిదారుల పూర్తి సమాచారం ఎమ్మెల్యేల వద్ద ఉండాలి. ఎమ్మెల్యేలు, కార్యకర్తలు నిత్యం ప్రజలతో మమేకం కావాలి. ప్రజలతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలి. టీఆర్ఎస్ కార్యకర్తల బలంతో ఓటర్లందరినీ చేరుకోవాలని కేసీఆర్ సూచించారు.

బీజేపీతో పోరాడాల్సిందే..

బీజేపీ నుంచి ఎదురయ్యే దాడిని సమర్థంగా తిప్పికొట్టాలి. బీజేపీతో పోరాడాల్సిందేనని కేసీఆర్ చెప్పారు. ప్రభుత్వాలను కూలగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. మన దగ్గర కూడా ప్రయత్నించి అడ్డంగా దొరికారు. ఆ పార్టీ కుట్రలన్నింటినీ తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో చట్టం తన పని తాను చేస్తోందని తెలిపారు. సీబీఐ, ఈడీ దాడులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు.



# రేగాతోనే అభివృద్ధి సాధ్యం: బూర్గంపాడు మండలం బిఆర్ఎస్ అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి



బూర్గంపాడు ( ప్రజా పాలన.) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని నకిరి పేట గ్రామ పంచాయతీ లోజరిగిన మండల యూత్ కమిటీ సమావేశంలో రాజకీయాల్లో , ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువకుల కీలకపాత్ర పోషించాలని బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి అన్నారు... టీఆర్ఎస్ పార్టీ బూర్గంపహాడ్ మండల యువజన అధ్యక్షుడు గోనెల నాని అధ్యక్షతన నకిరి పేట లో జరిగిన మండల యూత్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని గోనెల నాని మాట్లాడుతూ... భవిష్యత్ రోజుల్లో రాజకీయాల్లో యువకులు అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రచారం చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు పినపాక నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని అందరికి తెలిసేలా గ్రామాల్లో యువత భాధ్యత తీసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన న్నారు. ప్రజాప్రతిని ధులు, సీనియర్ నాయకులను కలుపుకొని రాజకీయాలు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎన్నుకున్న నకిరి పేట గ్రామ కమిటీ లో అధ్యక్షులు గా కిలవత్ శివా , ప్రధాన కార్యదర్శి గా సీలం వెంకటేష్,ఉపాధ్యక్షులు గాబానోత్ కృష్ణ, దాసరి శ్రీనాథ్ సెక్రెటరీ గా బానోతు కిట్టు, జాయింట్ సెక్రటరీలు గా మడక ఆనంద్, లకావత్ స్వామీ ల ను గ్రామ యువత మొత్తం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి , మండల యూత్ అధ్యక్షులు గోనెల నాని, ప్రధాన కార్యదర్శి యడమకంటి సుధాకర రెడ్డి, మండల ప్రచార కార్యదర్శి తోకల సతీష్ ,మండల వైస్ ప్రెసిడెంట్ లు భగవాన్ రెడ్డి,కాధర్, గ్రామ కమిటీ అధ్యక్షులు అధ్యక్షులు బోల్ల వీరన్న, మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు బండారి వంశీ, మండల యువజన నాయకులు కోట రమేష్, మందా ప్రసాద్, మహేష్ , ఉపసర్పంచ్ బోళ్ళ వెంకన్న, తాటి సారయ్య,ధారవత్ మల్క,దాసరి లింగన్న మరియూ గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు....

## ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో పిల్లలకు చిత్రలేఖన పోటీలు



బోనకల్ ,నవంబర్ 15 ప్రజా పాలన ప్రతినిధి: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రై సంస్థ సహకారంతో ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలో ఉన్న పది ప్రాథమిక పాఠశాలల నందు బాలల దినోత్సవ సందర్భంగా ఆర్ట్ , క్రాఫ్ట్ కాంపిటీషన్ నిర్వహించడం జరిగింది. కేవీఎం జడ్పీఎస్ఎస్ ఆళ్లపాడు పాఠశాల నందు మంగళవారం జరిగిన బాలల దినోత్సవం పురస్కరించుకొని బాలల్లో ఉన్నటువంటి సృజనాత్మకతను వెలికి తీసే విధంగా ఈ కాంపిటీషన్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. పిల్లలకు వారి యొక్క హక్కులు, వారి కోసం పనిచేస్తున్న హెల్ప్ లైన్ నెంబర్లు, అదేవిధంగా వారికోసం పనిచేసే వివిధ రకాలైన వ్యక్తులకు సంబంధించి వారికి ఉన్న అవగాహన మేరకు డ్రాయింగ్స్ గీసే విధంగా పోటీ నిర్వహించడం జరిగింది. బాలలచే గీయబడిన డ్రాయింగ్ షీట్లను పాఠశాలలో ఒక రూమ్ లో అతికించి దానిని చైల్డ్ రైట్స్ కార్నర్ గా తయారుచేసి పిల్లలు గీసిన డ్రాయింగ్ లను సందర్శించే విధంగా పాఠశాల ఉపాధ్యాయులు ఎస్ఎంసి మెంబర్లు, పంచాయతీరాజ్ ఇన్స్టిట్యూషన్ల నుండి పెద్దలను ఆహ్వానించడం జరిగింది. ఈ డ్రాయింగ్స్ పక్కనే ఒక చార్ట్ ను అంటించి ఆ చార్ట్ పై వచ్చిన అతిధుల యొక్క సంతకాలను , పిల్లల యొక్క సంతకాలను సేకరించి పిల్లలో అవగాహన కల్పించడం జరిగింది. ఈ విధంగా ప్రతి పాఠశాల నుండి మొదటి, రెండవ డ్రాయింగ్ లను సెలెక్ట్ చేయడం జరిగింది. ఈ విధంగా సెలెక్ట్ చేసిన వారందరిని రేపు జరగబోయే మండల స్థాయి ఆర్ట్ కాంపిటీషన్లో వారికి వేరే పోటీ నిర్వహించడం జరుగుతుంది. ఈ పోటీలో "మై డ్రీమ్స్ స్కూల్" అనే కాన్సెప్ట్ తో పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే విధంగా కాంపిటీషన్ నిర్వహించి మండల స్థాయిలో గెలిచిన ఈ పోటీలో పాల్గొన్న పిల్లలందరికీ బహుమతులు ప్రధానం చేస్తామని నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మర్రి తిరుపతి రావు, ప్రధానోపాధ్యాయులు రమేష్ , పాఠశాల సిబ్బంది, ఎఫెర్టు సంస్థ సభ్యులు నర్సమ్మ, పిఊటి మాధవరావు, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పార్లమెంటుకు అంబేద్కర్ పేరు పెట్టాలి

### ధర్నా గోడ ప్రతులను ఆవిష్కరించిన కాంగ్రెస్ నాయకులు



జన్నారం, సెప్టెంబర్ 16, ప్రజాపాలన: భారత నూతన అత్యున్నత పార్లమెంటుకు అంబేద్కర్ పేరు నామకరణం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 28 29 తేదీలలో ఢిల్లీలోని జంతర్ మంతర్ దర్నాకు సంబంధించిన గోడపత్రులను మంగళవారం తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోర్లకుంటా ప్రబూదాస్ ఆవిష్కరించారు . మంగళవారం మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో మాట్లాడుతూ డిల్లీలో నూతన పార్లమెంటు భవనానికి అంబేద్కర్ పేరు పేట్టి చిర స్థాయిగా చరిత్రలో నిలిచే విదంగా చూడాలని అన్నారు. రాష్ట్ర సచివాలయంలో 1025 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అయన తెలిపారు. ఈ కార్యాక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దావుల రమేష్, తాళ్లపల్లి రాజేశ్వర్ రాష్ట్ర నాయకులు, బచ్చల అంజన్న రాష్ట్ర కార్యదర్శి, కొత్తపెల్లి మహేందర్ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు, తౌటు సంజీవ్ జిల్లా కార్యదర్శి, పూర్వపు రాజారాం, దుర్గం చంద్రశేఖర్, బైరి తిరుపతి, నేరెళ్ల లక్ష్మణ్, పి ప్రశాంత్, బాదావత్ రాజు, చాకలి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్ర స్థాయిలో ప్రజలను కలుస్తూ... పంటలను పరిశీలిస్తూ.. చెరువు సందర్శన







పాలేరు నవంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి నేలకొండపల్లి ప్రభుత్వ పథకాల అమలు గురించి తెలుసుకునేందుకు ఢిల్లీ నుంచివచ్చిన పార్లమెంట్ లోని సెక్రటేరియట్ కు అసిస్టెంట్ సెక్షన్ అధికారులు మండలంలోని మండ్రాజుపల్లి లో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. రెండో రోజు మంగళవారం కేంద్ర అధికారుల బృందం మిధనుర్మాన్,ఫ్లయిస్సింగ్, రవిషక్కుమార్, తేజేందర్ సింగ్ లు ఉదయం 5 గంటల నుంచే కార్యక్రమాలు చేపట్టారు. తొలుత రైతు వేదిక నుంచి చెరువు వరకు వాకింగ్ చేశారు. మార్గమధ్యలో కలిసిన గ్రామస్తులతో ముచ్చటించారు. గ్రామంలో వరి పంట పొలాలను, చెరుకు తోటలనుపరిశీలించారు. గడ్డి కోసే రైతులు వద్ద కు వెళ్లి పశుగ్రాసం తో ప్రయోజనాలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయం, పాడి పంటల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే పధకాల గురించి ఆరా తీశారు. వైద్య శాఖ కు సంబంధించి బోదులబండ పీహెచ్సీ ని సందర్శించి వైద్యాధికారి ని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేర్వేర్ గా గా అడిగి తెలుసుకున్నారు. విద్య గురించి పాఠశాలను కలిసి పాఠశాల బస్సులో కొద్ది దూరం ప్రయాణించారు. గ్రామంలో పలు వీధుల్లో పర్యటించి ప్రజల నుంచి పలు అంశాల పై వివరాలుకోవిడ్ సమయంలో వైద్య శాఖ అందించిన సేవలు గురించి సిబ్బంది సందర్శించి బోధన గురించి తెలుసుకున్నారు. సరదా గా విద్యార్థులతోకలిసి పాఠశాల బస్సులో కొద్ది దూరం ప్రయాణించారు. గ్రామంలో పలు వీధుల్లో పర్యటించి ప్రజల నుంచి పలు అంశాల పై వివరాలు. అనంతరం రైతు వేదికలో ఐకేపీ, ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖల పై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.జమలారెడ్డి, మండల పంచాయతీ అధికారి సిహెచ్.శివ, చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, ఎంపీపీ వజ్జా రమ్య, సర్పంచ్ నెల్లూరి అనురాధ. పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.




## మానవత్వం చాటుకున్న ఈ ఎఫ్ 141 బి ఎన్ సిఆర్పిఎఫ్ వారు



అశ్వాపురం (ప్రజా పాలన.): భద్రాద్రి కొత్తగూడెం అశ్వాపురం మండల మల్లెలమడుగు గ్రామ పంచాయతీ రేగా కాలని ( చింత కుంట) గ్రామ ప్రజలకు ఇండియన్ బెటాలియన్ ఫోర్స్ ఐజి ర్యాంక్, ఎస్పి ర్యాంక్, డి.ఎస్.పి ర్యాంక్,తెలంగాణ స్టేట్ పోలీస్ ఆఫీసర్స్ రోజు వారి పనిముట్లు ( పార,పలుగు) మరియు సోలార్ లైటింగ్స్ 4 (4x160000) రేగా కాలని గ్రామ ప్రజలకు సర్పంచ్ క్రిష్ణవేణి చేతుల మీదగా అందజేశారు."ఈ కార్యక్రమం లో డి.ఎస్.పి రాఘవేంద్రరావు, అశ్వాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీ.ఐ) శ్రీనివాస్,సబ్ ఇన్స్పెక్టర్స్ (స్.ఐ) జితేందర్,నాగుల్ మీరా,మండల బిఆర్ఎస్పా ర్అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్,వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం,బూర్గంపాడు మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుంపేనా శ్రీను,మల్లెలమడుగు ఉప సర్పంచ్ చావా వీరరాగావులు,పంచాయితీ కార్యదర్శి బిందు,మణుగూరు గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా " శ్రీనివాస్,మండల మైనార్టీ సెల్ కమిటీ అధ్యక్షులు నయీమ్,అంగన్వాడీ టీచర్ కోడి దీప్తి,వార్డు మెంబర్లు, పార్టీ నాయకులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలలో సత్తా చాటిన మధిర విద్యార్థులు



మధిర పట్టణంలో మంగళవారం నాడు వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మండపంలో నిర్వహించిన జాతీయస్థాయి సాంస్కృతిక పోటీలలో మధిర పట్టణానికి చెందిన భరత్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించడం జరిగింది ఈ కార్యక్రమానికి ఉమెన్స్ రైట్స్ జాతీయ ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు హాజరై బాలల దినోత్సవం కార్యక్రమంలో మొదటి ద్వితీయ బహుమతులు విద్యార్థులకు బహుమతి సాధించిన విద్యార్థు లకు అందించారు .ఈ సందర్భంగా క్లాసికల్ నృత్యాలు, భరతనాట్యం, జానపదం విభాగాలలో వరుసగాద్వితీయ, తృతీయ, చతుర్ధ బహుమతులు సాధించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యానంస్థల అధినేతలు శీలం విద్యాలత, వెంకటరెడ్డి దంపతులు,ప్రిన్సిపాల్ జింకల కోటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు బహుమతులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

## జోగన్ పల్లి గ్రామంలో దొంగల బీభత్సం



కోరుట్ల,నవంబర్ 15 ( ప్రజాపాలన ప్రతినిధి ):కోరుట్ల పట్టణం, మండలంలో వరుసగా జరుగుతున్న చోరీలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. తాళం వేసి ఉన్న ఇండ్లే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి కోరుట్ల మండలం జోగన్ పల్లిలో రెండు ఇండ్లలో జరిగిన దొంగతనాలతో ప్రజలు భయంభయంగా గడుపుతున్నారు. వివరాలలోకి వెళితే.. కోరుట్ల మండలం జోగిన్ పల్లి గ్రామానికి చెందిన ఎర్ర లక్ష్మి ఆరోగ్యం బాగాలేక ఇంటికి తాళం వేసి ఆసుపత్రికి వెళ్లగా రాత్రి దొంగలు ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో సూట్కేస్ లో ఉన్న రూ. 30 వేల నగదు, 8 మాసాల బంగారంతో సహా సూట్కేస్ ఎత్తుకెల్లినట్లు స్థానికులు తెలిపారు. అలాగే అదే గ్రామానికి చెందిన రాంపెల్లి రాజేశం కుటుంబం ఇంటికి తాళం వేసి అదే గ్రామంలో నివసిస్తున్న తన కూతురు ఇంటికి వెళ్లి నిద్రించి, ఉదయం తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి దొంగలు తాళం పగులగొట్టి చోరీకి విఫల యత్నం చేశారని, కానీ ఏమీ దొంగిలించబడలేదని స్థానికులు తెలిపారు.

## సైబర్ నేరాల పట్ల ప్రజలు, ప్రభుత్వం ఉండాలి

తాండూర్ ప్రజా పాలన ప్రతినిధి . సైబర్ నేరల పట్ల ప్రజల ప్రభుత్వం ఉండాలని ప్రజల కోడ్ నెంబర్లను మోసగాళ్లు తీసుకొని బ్యాంకుల ద్వారా డబ్బులు డ్రా చేసుకొని హైటెక్ దొంగతనాలకు పాల్పడుతున్నారని తాండూర్ ఎస్సై మహిపాల్ రెడ్డి తాండూర్ లో ప్రజలను తాండూర్ లో ప్రజలను చైతన్యవంతం చేశారు. ఎవరైనా ఇలా డబ్బులు డ్రా చేసినట్లు తెలిస్తే వెంటనే ఒకటి తొమ్మిది మూడు సున్నా నంబరుకు 1930డయల్ చేసి పోలీసులకు అప్లికేషన్ ఇవ్వాలని అలా అయితే డబ్బులను మీ డబ్బులను మీకు వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు . సెల్ ఫోన్ ద్వారా ద్వారా డబ్బులను వేసి అకౌంట్ నెంబర్లను తీసుకొని అకౌంట్ నెంబర్ ద్వారా సైబర్ నెలలకు పాల్పడుతున్నారని ప్రజలు అప్రమంతంగా ఉండాలని తాండూర్ ఎస్సై మహిపాల్ రెడ్డి చైతన్యం చేస్తున్నారు. ఇలాంటి నేరాలు జరుగుతున్నట్లు తమకు అప్లికేషన్లు వస్తున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి ఇలాంటి నేరాలు పాల్పడే వారిపై జాగ్రత్తగా ఉండాలని కోరారు.

# ప్రజాపాలన

**సంపాదకీయం**

బుధవారం 16, నవంబరు 2022


## తెలంగాణ స్వప్నాలను భగ్నం చేస్తే...

భారతీయ జనతా పార్టీ ఒక అజేయ శక్తి. ఇటీవల ఆరు రాష్ట్రాలలో జరిగిన ఉప ఎన్నికల ఫలితాలే అందుకు సాక్ష్యం. అదే విజయపరంపర హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బిజెపి కొనసాగించి తీరుతుందనడంలో ఎవరికీ సందేహం లేదు. విచిత్రమేమంటే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర జరుపుతున్న సమయంలోనే ఆ పార్టీ ఎన్నికల్లో తీవ్రంగా దెబ్బతినడం. తాము దళిత నేత మల్లికార్జున ఖర్గేను అధ్యక్షుడుగా ఎన్నుకున్నామని ఎంత ప్రచారం చేసినప్పటికీ ప్రజలు ఆ పార్టీ అభ్యర్థుల ముఖాలు కూడా చూసేందుకు సిద్ధపడడం లేదు. పార్టీ అధ్యక్షుడుగా ఎన్నికై దాదాపు నెలరోజులు దాటుతున్నప్పటికీ కాంగ్రెస్‌లో ఎటువంటి ఉత్తేజమూ కనపడడం లేదు. ఖర్గే పార్టీ అధ్యక్షుడైన తర్వాత ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట అయిన మునుగోడులో ఆ పార్టీ డిపాజిట్ కోల్పోయింది. కేసిఆర్ కేబినెట్ అంతా మునుగోడులో నెలరోజులుగా తిష్ట వేసినా వేల కోట్లు, మద్యం పంచిపెట్టినా, పోలీసులు, అధికారులను ప్రయోగించి పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగం చేసినా టీఆర్ఎస్ అభ్యర్థి కేవలం పదివేల ఓట్లతో గెలవడం టీఆర్ఎస్ పతనాన్ని సూచిస్తోంది. గతంలో పెద్దగా ఉనికి లేకపోయినప్పటికీ ఈ ఎన్నికల్లో బిజెపి నల్లగొండలో ప్రవేశించింది. భవిష్యత్‌లో కాంగ్రెస్, వామపక్షాలతో పాటు టీఆర్ఎస్‌ను తుడిచిపెట్టేందుకు మునుగోడు ఎన్నికలు రంగం సిద్ధం చేశాయి. సిద్ధాంతాలను వల్లె వేసే వామపక్షాలు ఒక అవినీతి మయమైన కుటుంబపాలనతో కూడిన కేసిఆర్ భ్రష్టపాలనను సమర్థించడం, ఆయన దయాదాక్షిణ్యాలకోసం అర్రులు చాచడంతో అవి ఎంతగా దిగజారిపోయాయో అర్థం అవుతుంది. ఈ దేశంలో సిద్ధాంతాల ఆధారంగా నడుస్తున్న పార్టీ ఏదైనా ఉందంటే అది బిజెపి తప్ప మరేమీ కాదని ప్రజలకు రోజురోజుకూ తెలుస్తోంది. హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ హయాంలో జరిగిన తీవ్ర అవినీతిని ప్రజలు ఇంకా మరిచిపోలేదు. పది సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో భారీ కుంభకోణాలు జరిగాయి. ప్రస్తుత ముఖ్యమంత్రి జైరామ్ ఠాకూర్ హయాంలో హిమ్‌కేర్ ఆరోగ్య పథకం, జల్ జీవన్ మిషన్ వంటి ప్రజా సంక్షేమ పథకాలు ఎన్నో అమలు అవుతున్నాయి. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం హిమాచల్‌లో రూ. 44 వేల కోట్ల విలువైన అభివృద్ధి పథకాలను అమలుచేస్తోంది. అవినీతి రహిత స్వచ్ఛమైన పాలన, అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే బిజెపిని తిరిగి గెలిపించాలని హిమాచల్ ప్రజలకు తెలుసు. అందుకే ఏ సంస్థ ఒపీనియన్ పోల్ నిర్వహించినా వారు బిజెపి వైపే మొగ్గు చూపుతున్నారని తేలింది. తాజాగా రిపబ్లిక్ టీవీ, పీ-మార్క్ నిర్వహించిన పోల్‌లో బిజెపి 68 సీట్లలో 37-45 సీట్ల మధ్య గెలుచుకుంటుందని తేలింది. రెండు రోజుల క్రితం హిమాచల్‌లో జరిగిన పోలింగ్‌లో సమధికోత్సాహంతో ఓటు వేసిన దాదాపు 75 శాతం ప్రజలు అధికంగా బిజెపి వైపే మొగ్గు చూపి గత నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయానికి భిన్నంగా అధికార పార్టీ వైపే మొగ్గు చూపుతున్నారని తేలినట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గుజరాత్‌లో బిజెపి 27 సంవత్సరాలుగా అధికారంలో ఉన్నది. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ రోజురోజుకూ క్రుంగి కృశించిపోతుండగా ప్రజలు ప్రతిసారీ బిజెపిని సమధికోత్సాహంతో ఎన్నుకుంటున్నారు. ఈసారి కూడా బిజెపి 182 సీట్లలో 127 నుంచి 140 సీట్లు సాధిస్తుందని రిపబ్లిక్ టీవీ పోల్ తెలిపింది. కాంగ్రెస్ సీట్ల సంఖ్య 28 నుంచి 22కి పడిపోతుందని, ఎంత హంగామా చేసినా ఆమ్ ఆద్మీ పార్టీ గుజరాత్‌లో కేవలం ఒక సీటే సాధించగలదని ఈ పోల్ చెప్పడం గమనార్హం. అంతకు ముందు ఏబీసీ, సీ-ఓటర్ నిర్వహించిన సర్వేల్లో కూడా గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్‌లో బిజెపి మెజారిటీ సీట్లతో తిరిగి అధికారంలోకి వస్తుందని తేలింది. నిజానికి గుజరాత్‌లో బిజెపి తన విజయం గురించి ఏనాడూ పెద్దగా ఆలోచించలేదు. పోటీ చేసిన ప్రతి సారీ గతంలో కంటే ఎక్కువ సీట్లు సాధించాలనేదే బిజెపి ధ్యేయం. 2017 ఎన్నికల్లో బిజెపికి 182 సీట్లలో 99 సీట్లు లభించాయి. ఆ తర్వాత కాంగ్రెస్ సభ్యులు చేరడం, ఉప ఎన్నికల్లో విజయం సాధించడంతో బిజెపి సంఖ్యాబలం 127కు పెరిగింది, ఈసారి బిజెపి 127 సీట్ల కంటే అత్యధిక సీట్లు సాధిస్తుందని అన్ని సర్వేలు చెబుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వంత రాష్ట్రమైన గుజరాత్ ఇవాళ దేశంలో అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. ఇటీవల సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) నివేదిక ప్రకారం దేశంలో భారతీయ, విదేశీ కంపెనీల నుంచి తాజా పెట్టుబడులు ఆకర్షించిన అతి పెద్ద రాష్ట్రంగా గుజరాత్ నిలిచింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 3.98 ట్రిలియన్ మేరకు గుజరాత్‌లో పెట్టుబడులు వచ్చాయి. ఇవాళ దేశంలో పరిస్థితి ఏ విధంగా ఉన్నదంటే అనేక పార్టీల నేతలు తమంతట తాము బిజెపిలో చేరతామని సందేశాలు పంపుతున్నారు. ఢిల్లీలోని బిజెపి కేంద్ర కార్యాలయంలోనూ, రాష్ట్రాల్లోను ప్రతి రోజూ ఒకరిద్దరు చొప్పున బిజెపిలో చేరుతున్నారు. దేశమంతటా డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడే ఒక రాజకీయవాతావరణం దేశమంతా నెలకొనడమే ఇందుకు కారణం. ఇటీవల కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటించి పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టు ప్రారంభించారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నదన్న విషయంతో నిమిత్తం లేకుండా ఆయన అన్ని రాష్ట్రాల్లో సమతుల్య అభివృద్ధిని కోరుకుంటున్నారన్న విషయం దీన్ని బట్టి స్పష్టమయింది. ఆంధ్రప్రదేశ్‌లో చమురు, సహజవాయువు, రహదారుల రంగంలో రూ. 15,233 కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించి రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉన్న విషయాన్ని మోదీ మరోసారి గుర్తు చేశారు. అయితే అభివృద్ధి అన్న పదాన్ని తన డిక్షనరీ నుండి తొలగించిన జగన్, మోదీ చేస్తున్న అభివృద్ధిని తన ఖాతాలో వేసుకోవాలని వ్యర్థ ప్రయాసం చేయడం ఆ పార్టీ దివాళాకోరుతనానికి నిదర్శనం. తెలంగాణలో రామగుండం ఎరువుల ప్లాంట్‌ను పునరుద్ధరించడంతో పాటు రూ. 9500 కోట్ల ప్రాజెక్టులను ప్రారంభించారు. విషాదకరమేమంటే ఒక సత్సంప్రదాయం ప్రకారం ప్రధానిని ముఖ్యమంత్రి కేసిఆర్ స్వాగతించకుండా అవమానించడం. తెలంగాణలో బిజెపి కార్యకర్తలతో మాట్లాడుతూ మోదీ కేసిఆర్ వైఖరి వెనుక రహస్యాన్ని వెల్లడించారు. తమ అవినీతి కార్యకలాపాలపై దర్యాప్తు జరుగుతుంటే వాటి నుంచి తప్పించుకునేందుకు నిరాశా నిస్పృహలతో వ్యవహరిస్తూ దూషణలకు లంకిస్తున్నారని ప్రధానమంత్రి చేసిన వ్యాఖ్యల్లో అంతరార్థముంది. మోదీని దూషించడం, బిజెపిపై బురదచల్లడం ద్వారా తమ అక్రమ, అవినీతి కార్యకలాపాల నుంచి బయటపడగలమని కేసిఆర్ అనుకుంటే అంతకంటే అమాయకత్వం ఏమీ లేదు. మునుగోడులో చావు తప్పి కన్నులొట్టబోయినట్లు బయటపడిన కేసిఆర్ ప్రజా మద్దతు కోల్పోతున్నారని, తెలంగాణలో కమలం వికసిస్తోందని మోదీ గ్రహించారు. అందుకే కేసిఆర్ దుర్భాషలకు పెద్దగా బాధపడవద్దని ఆయన కార్యకర్తలకు చెప్పారు. 'గత 20 సంవత్సరాలుగా నాపై అనేకమంది దుర్భాషలాడుతునే ఉన్నారు. నిఘంటువుల్లో పదాలు వెతుక్కుని మరీ నన్ను తిడుతున్నారు. ప్రతిరోజూ రెండు, మూడు కిలోల తిట్లను తినడం వల్లనే నాకు శక్తి సమకూరుతోంది. దేవుడు అవమానాలను భరించే శక్తి నాకు ఇచ్చాడు. నన్ను తిడితే తిట్టొచ్చు. కాని తెలంగాణ స్వప్నాల్ని భగ్నం చేస్తే మాత్రం ప్రజలను లూటీ చేస్తున్న వారిని క్షమించే ప్రసక్తి లేదు..' అని ఆయన హెచ్చరించారు. కేసిఆర్, సందేశం అందిందా?

# ప్రతిదానికీ సీబీఐ అవసరమా?




'రాష్ట్రప్రభుత్వం న్యాయం చేస్తుందని మాకు నమ్మకం లేదు. ఈ కేసును సీబీఐ విచారణకు అప్పగించాలి' లాంటి డిమాండ్స్ చాలా రాష్ట్రాలలో ఇటీవల తరచు చోటుచేసుకుంటున్నాయి. రాజకీయ లబ్ధి కోసం, చీటికీ మాటికీ ప్రతి వివాదానికీ సీబీఐ విచారణ అంటూ డిమాండ్ చేయడం, ఒక్కోసారి తలనొప్పి తగ్గించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అంగీకరించడం జరుగుతున్నది. దేశంలో అత్యున్నత దర్యాప్తు సంస్థ సీబీఐ అనే విషయం ఎవరూ కాదనరు. అందుకేనేమో, నేర పరిశోధనను కొలిక్కి తీసుకుని రావటంలో అందరినోటా మొదటిగా వినిపించే మాట సీబీఐనే. కానీ ప్రజా జీవితంలో సీబీఐ ఏమేరకు శక్తివంతమైన పాత్రను పోషిస్తున్నదీ, జాతీయ సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థల కుశలతపై ఎంతవరకూ భరోసానిస్తున్నదీ అన్నది రోజులు గడుస్తున్నకొద్దీ ప్రశ్నార్థకం అవుతున్నది. ఈ సంస్థ భారత ప్రభుత్వం అధికార పరిధిలో, దాని చెప్పుచేతల్లో పనిచేస్తూ, కేంద్ర ప్రభుత్వ పాలకుల చేతిలో పావుగా మారి, న్యాయస్థానాల ధర్మాగ్రహానికి కూడా గురైన సందర్భాలు చాలా ఉన్నాయి. సరిగ్గా ఒక ఏడాది క్రితం సుప్రీంకోర్టు సీబీఐని అది చేపట్టిన కేసుల్లో ఎన్ని ప్రోసిక్యూషన్ దాకా వచ్చాయి? ఎన్ని పెండింగులో ఉన్నాయి? శిక్షలు పడ్డ వాటి శాతం ఎంత? తదితర వివరాలను సమర్పించమని కోరింది కూడా. ఇటీవల నలుగురు టీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం బహిర్గతం కావడం, స్థానిక పోలీసులు కార్యరంగంలోకి దిగి చట్టప్రకారం చర్యలు చేపట్టడం తెలిసిందే. ఆడియో టేపులు బైటపడటంతో, బీజేపీ నాయకులు, ప్రతినిధులు ఈడీ లాంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఆశ్రయించారు. ఈ అంశంపై సీబీఐతో విచారణకు ఆదేశించాలని కూడా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. శాంతి భద్రతల సమస్య, అవినీతికి చెందిన అంశాలను దర్యాప్తు చేయడానికి రాష్ట్ర సంస్థలు ఉన్నప్పటికీ, నేరారోపణ జరిగిన తక్షణమే అలా కోరడం సబబేనా? ఏరాష్ట్రంలోనైనా రాజకీయ నాయకులూ రాజకీయ పార్టీల ప్రమేయం ఉన్న కేసుల విషయంలో గాని, సమాజంలో పెద్దమనుషులుగా చెలామణి అవుతున్న వారి ప్రమేయం ఉన్న కేసుల విషయంలో గాని, స్థానిక దర్యాప్తుసంస్థల మీద నమ్మకం లేదన్న కారణంతో, సీబీఐ దర్యాప్తును కోరడం పరిపాటే. న్యాయస్థానాలు కూడా తరచూ సీబీఐ దర్యాప్తుకు ఆదేశిస్తుంటాయి. అయితే మొదటి నుంచీ సీబీఐ దర్యాప్తు విషయంలో, కేంద్రంలో అధికారంలో వున్న పార్టీకి చెందని రాష్ట్ర ప్రభుత్వాలు భిన్న ధోరణిని అవలంబించటం కూడా ఆనవాయితీనే. చట్టాలు ఏమిచెప్పినా సీబీఐ దర్యాప్తు విషయంలో సరైన సాంప్రదాయాలు ఇంతవరకూ ఏర్పడలేదన్నది వాస్తవం. ఒక్కసారి చరిత్రలోకి తొంగి చూస్తే, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) 1941లో భారత ప్రభుత్వం స్థాపించిన 'స్పెషల్ పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్' అనే పేరుతో ఆరంభమైంది. అలనాటి బ్రిటీష్ ఇండియా ప్రభుత్వం ఈ సంస్థను రెండవ ప్రపంచ యుద్ధం కాలంలో, యుద్ధ సామాగ్రి కొనుగోళ్ల లావాదేవీలలో జరగడానికి ఆస్కారమున్న అవినీతి కేసుల దర్యాప్తుకే పరిమితం చేసింది. పరిణామక్రమంలో భాగంగా, యుద్ధం ముగిసిన తరువాత, కేంద్ర ప్రభుత్వ సిబ్బందికి సంబంధించిన అవినీతి ఆరోపణల కేసుల దర్యాప్తుకు మాత్రమే పరిమితం చేస్తూ, 1946లో, 'ఢిల్లీ స్పెషల్ పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం' తీసుకొచ్చింది ప్రభుత్వం. క్రమేపీ, ఈ సంస్థ పరిధిని కేంద్రపాలిత ప్రాంతాలకు, రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదంతో సంబంధిత రాష్ట్రాలకు విస్తరించారు. ఏప్రిల్ 1963లో, హోం మంత్రిత్వ శాఖ తీర్మానంతో, దాని పేరును 'సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్' (సీబీఐ)గా మార్చారు. ఇలా పేరు మార్పిడి జరిగిన తొలిరోజులలో, కేవలం కేంద్ర ప్రభుత్వ సిబ్బందిపై వచ్చిన అవినీతి ఆరోపణలు మాత్రమే విచారించడం దీని బాధ్యత. క్రమేపీ ప్రభుత్వ రంగ సంస్థల సిబ్బందిని, బేంకుల జాతీయకరణ తరువాత ఆ సిబ్బందినీ దీని పరిధిలోకి తెచ్చారు. క్రమక్రమంగా దాని పరిధి మరింత విస్తరించింది. రాష్ట్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థల మీద నమ్మకం లేని ప్రతివారూ సీబీఐ పేరు తెరమీదికి తేవడం అలవాటైపోయింది. ఇలా ఎందుకు జరగాలి? సీబీఐ వ్యవస్థాపక డైరెక్టర్ డిపి కొహిలి, దాని ఆవిర్భావపు రోజులలోనే, అదొక జాతీయ స్థాయి దర్యాప్తు సంస్థగా ఎదుగుతుందని జోస్యం చెప్పాడు. ఐదేళ్ళ తన పటిష్టమైన నేతృత్వంలో ఆయన సీబీఐ నేటి ఈ స్థితికి చేరడానికి పునాదులు వేశారు. సిబీఐ నుంచి అత్యున్నత ప్రమాణాల సమర్థతను, దక్షతను, సత్యనిష్ఠను భవిష్యత్?లో పౌరులు ఆశిస్తారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేయాల్సిన బాధ్యత దానిపై ఉందని కొహిలి ఆశయం. అధికారులకు 'లాయల్టీ టు డ్యూటీ'ని ప్రబోధించారు. ఆయన తదనంతర కాలంలో ఇవన్నీ ఎంతవేరకు జరుగుతున్నాయనేది కోటి రూకల ప్రశ్న. 1965 నుంచి ఆర్థికపరమైన నేరాల పరిశోధన అంశాన్ని కూడా సీబీఐ పరిధిలోకి తెచ్చింది ప్రభుత్వం. అలా కేంద్ర ప్రభుత్వం దాని పరిధిని మరింత విస్తరించ సాగింది. హత్యా నేరాలు, కిడ్నాపులు, తీవ్రవాద కార్యకలాపాల విషయాలలో కూడా సీబీఐతో దర్యాప్తు జరగాలన్న డిమాండు రాసాగింది. వ్యక్తులు, వ్యవస్థలు తమకు జరిగిందని భావిస్తున్న అన్యాయాల విషయంలో న్యాయం కలిగించమని కోర్టులను ఆశ్రయించినప్పుడు, కోర్టులు కూడా సీబీఐకి దర్యాప్తును అప్పచెప్తే స్థాయికి దానికి గుర్తింపు వచ్చింది. ఆ గుర్తింపును నిలబెట్టుకోవడంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ సఫలమైందా, విఫలమైందా అన్నది చరిత్ర తేల్చాలి. ఈ నేపథ్యంలో 1987 లో సీబీఐలో రెండు విభాగాలను ఏర్పాటు చేయవలసి వచ్చింది. ఒకటి: అవినీతి నిరోధక విభాగం, మరొకటి: ప్రత్యేక కేటగిరీ నేరాల విభాగం. ఇలాంటి నేపథ్యం ఉన్న సీబీఐ ఎవరికీ, ఏ విషయంలోనూ అన్యాయం చేయ (లే)దన్న నమ్మకం, అటు ప్రభుత్వాలకూ, ఇటు పౌరులకూ ఎంతవరకూ కలిగిస్తున్నదన్న విషయం ఇంతవరకూ అది చేపట్టి పరిశోధించిన కేసులను అధ్యయనం చేస్తే తప్ప అవగతం కాదు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. సీబీఐ తెలంగాణ రాష్ట్రంలో ఇకముందు ఏ కేసులోనైనా దర్యాప్తు చేయాలంటే ముందస్తుగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సిందే. దర్యాప్తు కోసం సీబీఐకి గతంలో ఇచ్చిన సాధారణ అనుమతిని ప్రభుత్వం వెనక్కి తీసుకున్నది. ఈ మేరకు ఆగస్టు 30న రాష్ట్ర ప్రభుత్వం జీఓ 51ని జారీచేసింది. ఇక ఏ కేసులోనైనా సీబీఐ దర్యాప్తు చేయాలంటే, జీవో 51 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరి. కేంద్ర ప్రభుత్వం సీబీఐ లాంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను తన రాజకీయ ప్రత్యర్థులను ఇబ్బందులకు గురి చేసేందుకు దుర్వినియోగం చేస్తున్నదన్న కారణంతో బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని కేంద్ర దర్యాప్తు సంస్థలకు సాధారణ సమ్మతిని ఉపసంహరించుకోవాలని నిర్ణయించాయి. పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, మేఘాలయ సహా తొమ్మిది రాష్ట్రాలు తమ పరిధిలోని కేసులను సీబీఐ విచారించేందుకు సాధారణ అనుమతిని ఉపసంహరించుకున్నాయి. తాజాగా ఈ జాబితాలో తెలంగాణ వచ్చి చేరింది. సీబీఐ చేపట్టిన కేసులు కొన్ని మచ్చుకు తీసుకుంటే అవి ఏమేరకు ఫలితాలను ఇచ్చాయనేది బోధపడుతుంది. దర్యాప్తు కొనసాగిన, కొనసాగుతున్న విధానం, ఎవరినీ దోషులుగానో నిర్దోషులుగానో తేల్చకుండా నెలల, ఏళ్ల తరబడి ముద్దాయిలుగా విచారించడం పేర్కొనవచ్చు. కేంద్రంలో ఉన్న అధికార పక్షం వారికి ఒక నీతి, ప్రతిపక్షాలవారికి వేరొక నీతి అవలంబించడమూ పరిపాటిగా మారింది. తెలుగు రాష్ట్రాలలోనే సుదీర్ఘకాలం విచారణ జరుగుతున్న కేసులు ఉన్నాయి. సీబీఐ తన పేరును పది కాలాల పాటు నిలబెట్టుకోవడానికి, నిష్పాక్షిక దర్యాప్తు సంస్థగా పేరు తెచ్చుకోవడానికి ప్రయత్నాలు అంతగా చేయలేదనాలి. ఆ సంస్థను ముద్దుగా కొందరు 'కాంగ్రెస్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్' అని, మరికొందరు 'కాంగ్రెస్ బచావో ఇన్‌స్టిట్యూట్' అని, ఇంకొందరు 'సెంట్రల్ బీజేపీ ఇన్వెస్టిగేషన్' అనీ నామకరణం చేశారు. వ్యాధి నివారణ కంటే నిరోధం ఎంత ముఖ్యమో, అవినీతి జరిగిన తర్వాత చర్యలకంటే ముందస్తుగానే అవినీతిని నిరోధించగల వ్యవస్థలుండటమూ అంతే ముఖ్యం. ఆ పని సీబీఐ చేయగలిగితే సంతోషమే! కావాల్సింది 'పోస్ట్ ఆడిట్' కాదు, 'ప్రీ ఆడిట్'. ఎమ్మెల్యేల కొనుగోలు, ప్రలోభం వ్యవహారం లాంటి దుర్మార్గపు చర్యలతో సంబంధం ఉన్నటువంటి వారిమీద ఒక కన్ను నిరంతరం వేసి ఉంచాలి. వారు చట్ట పరిధిలో వ్యవహరిస్తున్నారో లేదో విచారణ జరగాలి. ఈ రెండూ రహస్యంగానన్నా, బహిరంగానైనా జరిగి తీరాల్సిందే. ఎవరూ చట్టానికి అతీతులు కారు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. రాష్ట్ర దర్యాప్తు సంస్థల మీద నమ్మకం లేదని, సీబీఐతో విచారణ జరిపించాలని కొందరు ప్రతిదానికీ కోరడం ఎంతవరకు సమంజసం?

# విశాఖ సాక్షిగా ద్రోహానికి దాసోహం

ఊరక రారు మహానుభావులు అని, దేశాధినేత ఎవరూ ఆహ్వానించకుండానే వారే స్వయంగా విశాఖ రావడం విశేషమే, కానీ తప్పకుండా ఏదో మర్మమే ఉండి ఉంటుంది. ఏమైనా ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ 12వ తేదీ బహిరంగ సభ గొప్ప ప్రాచుర్యాన్నే పొందింది. ఇది ఆయన సభ అనడం కంటే వైసీపీ సభ అంటేనే సబబుగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ అధికారిక సభగా దీనిని ప్రకటించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వ పెద్దల హడావిడికి హద్దూపద్దూ కూడా లేదు. ఉత్తరాంధ్ర అన్ని జిల్లాల నుంచి ప్రజలను భారీగా సమీకరించారు. ప్రవేటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించి మరీ బస్సులను సమకూర్చారు. సభా ప్రాంగణం కోసం అక్కడున్న చెట్లన్నీ నరికేశారు. కోర్టు ఉత్తర్వులతో నడుస్తున్న సభకు ఏ అడ్డూ కాని అనేక షాపులను బుల్డోజర్లతో అర్ధరాత్రి కూల్చేశారు. ఇలాంటివి ఇంకా చాలా జరిగాయి. కానీ వీటికి మించి, నగరాన్నంతా వారం రోజుల ముందు నుంచీ పోలీసు వలయంలా మార్చేశారు. ఎటువంటి ప్రదర్శనలకూ అనుమతిని ఇవ్వలేదు. నిరసనలపై తీవ్ర నిర్బంధం ప్రయోగించారు. ముందు రోజునుండే అనేక మందిని అరెస్టు చేశారు, గృహ నిర్బంధంలో ఉంచారు. ఇలా చేయడం న్యాయమేనా అన్నది ఒక సందేహమయితే, ఎందుకిలా చేశారన్నదే అసలు ప్రశ్న. సభలో మొక్కుబడిగా ముఖ్యమంత్రి ప్రత్యేక హోదా, స్టీల్ ప్లాంటు అంశాలను ప్రస్తావించారు గానీ, ప్రధాని నుంచి కనీస స్పందన కూడా లేదు. ఇది రాష్ట్ర ప్రజలను అవమానించడమే. ప్రధాని సభా వేదిక నుంచి ప్రారంభించినవేవీ ఈ ప్రాంత ప్రజలు కోరుకున్నవి కావు. ఫిషింగ్ హార్బర్, విశాఖపట్నం రైల్వే స్టేషన్ ఆధునీకరణ వంటివన్నీ వారి కార్పొరేట్ మిత్రులకు సిరులు కురిపించడానికే. కొన్ని ఇప్పటికే పూర్తయిపోయినవే. నేడు మోదీ ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోంది. రాష్ట్ర విభజన, మోదీ ప్రభుత్వం అధికారంలోని రావడం ఏక కాలంలో జరిగాయి. ఎనిమిదేళ్లయినా, రాష్ట్ర విభజన చట్టం నేటికీ సంపూర్ణంగా అమలు కాలేదు. ప్రత్యేక హోదాను ఎగ్గొట్టారు. దుగ్గరాజుపట్నం పోర్టు, కడప ఉక్కు ఫేక్టరీ, విశాఖ, విజయవాడలలో మెట్రో రైలు ప్రాజెక్టులకు ఎగనామం పెట్టారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ప్రకటనలకే పరిమితమయింది. ఇక జాతీయ ప్రాజక్టుగా చట్టంలోనే పేర్కొన్న పోలవరం సంగతి చెప్పనవసరం లేదు. అనేక విద్యా సంస్థల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. పెట్రో యూనివర్సిటీ నిర్మాణమే ప్రారంభం కాలేదు. గిరిజన యూనివర్సిటీకి ఇంకా స్థల సేకరణే జరగలేదు. వెనకబడ్డ ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక అభివృద్ధి పేకేజీలు ప్రహసనంలా మారాయి. ఫలితంగా ఈ కాలంలో వెనుకబాటు మరింత పెరిగిందే తప్ప తగ్గలేదు. రాష్ట్రానికి ఒక్క మంచి కూడా చేయని మోదీ ప్రభుత్వం దేశమంతా, ఆఖరుకు వారి గుజరాత్ ప్రభుత్వం కూడా తిరస్కరించిన ప్రమాదకర అణువిద్యుత్ ప్లాంట్ కుంపటిని మాత్రం మన నెత్తిన రుద్దింది. రాష్ట్రానికి చట్ట ప్రకారం హక్కుగా రావలసిన వాటికి ఎగనామం పెట్టింది చాలక తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంటును తెగనమ్మేయాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించయడం ఈ ద్రోహానికి పరాకాష్ట. ఈ అన్ని అంశాలను బహిరంగ సభ వేదికగా ప్రజల సమక్షంలో ప్రధాని దృష్టికి తేవాలని, రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరాలని అనేక సంస్థలు, సంఘాలు ముఖ్యమంత్రికి అనేక విజ్ఞప్తులు చేశాయి. రాష్ట్రానికి జరుగుతున్న ఈ అన్యాయాన్ని ఎదిరించి, రాష్ట్ర హక్కులను కాపాడవలసిన జగన్ ప్రభుత్వం ఆ పని సమర్థవంతంగా చేయకపోగా, హక్కులకై పోరాడుతున్న ప్రజలపై జులుం ప్రదర్శించడం ఎవరి ప్రయోజనాలకోసం? స్టీల్ ప్లాంటు అమ్మకం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని గత 600 రోజులకు పైగా నిరసన దీక్షలు జరుగుతున్న దీక్షా శిబిరంపై పోలీసులు విరుచుకు పడి మహిళలనే కనీస విచక్షణ కూడా లేకుండా లాగిపారేయడం ఎవరిని మెప్పుకోసం? కార్మికులు చేయతలపెట్టిన మోటార్ సైకిల్ ర్యాలీకి అనుమతి ఇవ్వకుండా వందలమందిని దుర్మార్గంగా అరెస్టులు ఎందుకు చేసినట్లు? ఇటువంటి చర్యల అంతరార్థం "నేను మిమ్ములను అడగను- అడిగిన వారిని సహించను" అనే ఖచ్చితమైన భరోసా జగన్ ప్రభుత్వం బిగ్‌బాస్‌కు ఇవ్వడం కాదా? మీ "ద్రోహాన్ని కొనసాగించండి- మిగిలిన ప్రభుత్వ సంస్థలను కూడా అమ్మేయండి", అడ్డొచ్చిన వారి సంగతినే చూసుకుంటా అని చెప్పడం కాదా? ఇది ద్రోహం చేస్తున్న మోదీకి దాసోహం అవడం కాదా? జెల్ల కొట్టిన వాడికే భజన చేయడం విడ్డూరం కాదా?

## పడిపూజ పాల్గొన్న వైస్ ఎంపీపీ శీలం శివపార్వతి



తల్లాడ, నవంబర్ 15 (ప్రజాపాలన న్యూస్): తల్లాడ మండలం రామానుజవరం గ్రామంలో కర్నాటి ప్రభాకర్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలదారుడు రామనుజవరం మాజీ ఉపసర్పంచ్ యన్నం శ్రీనివాసరెడ్డి-శ్రీలక్ష్మి దంపతులచే అయ్యప్ప స్వామికి పలు రకాల పూలు, ఫలరసాలతో పూజలు, అభిషేకాలను కన్నుల పండుగగా మంగళవారం పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పదునెట్టంబడి వెలిగించి, స్వాములకు,భవానీలకు, భక్తులకు, తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శీలం శివపార్వతి ,గణేష్ రవి, సరికొండ సాంబశివరాజు, మొగులోజు రమేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకు ఆర్ టి సి



శంకరపట్నం నవంబర్ 14 ప్రజాపాలన ప్రతినిధి:శంకరపట్నం మండల కరీంపేట గ్రామం లో హుజురాబాద్ ఆర్ టి సి డిపో మేనేజర్ పి.అర్పిత ఆదేశాల మేరకు ఈరోజు కరీంపేట గ్రామంలో ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమము నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమమో లో కేశవపట్నం కరీంపేట్ మొగోలిపాలెం గ్రామ మిడుగ కరీంనగర్ కి బస్సు నడపటానికి సన్నాహాలు చేస్తు ప్రజలకు అవగాహన కార్యక్రమం చెపట్టినారు ఇట్టి కార్యక్రమంలో కరీంపేట్ గ్రామ సర్పంచ్ వనపర్తి మల్లయ్య గారు హుజూరాబాద్ ఆర్టీసీ ఆర్ ఐ, ఎల్ సారయ్య ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సి ఆర్ సి డి స్వామి కేశవపట్నం బస్టాండ్ ఇన్చార్జి గుర్రం స్వామి మరియు కరీంపేట గ్రామం ప్రజలు తధితరులు పాల్గొన్నారు

## రైల్వే స్టేషన్ తనిఖీ చేసిన అదనపు కమర్షియల్ అధికారి రవికాంత్



బెల్లంపల్లి నవంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి: దక్షణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అజయ్ కుమార్ జై న్ పర్యటన ఈనెల 19న ఉ ండటంతో, వివిధ స్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించడానికి దక్షిణ మధ్య రైల్వే అదనపు కమర్షియల్ మేనేజర్ రవికాంత్,బెల్లంపల్లి రైల్వే స్టేషన్ను మంగళ వారం తనికీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ కు రంగులు వేసే పనులను శానిటేషన్ పనులు, పరిసరాల పరిశుభ్రత, ప్లాట్ ఫామ్ మీద ఉన్న క్యాంటీన్లను ప్రత్యేకంగా పరిశీలించారు. పలు విషయాల పై సంబంధిత అధికారులతో మాట్లాడి వారికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రవికాంత్ తో పాటు స్టేషన్ మేనేజర్ రవీందర్, పలు విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## శాంతిఖని గనిలో క్విజ్ పోటీలు.. విజేతలకు బహుమతి ప్రధానం



బెల్లంపల్లి నవంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి:బొగ్గు నాణ్యతవారోత్సవాల సందర్భంగామంగళవారం బెల్లంపల్లి శాంతిఖని గనిలో గని ఉద్యోగులకు అధికారులు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ క్విజ్ పోటీల్లో బొగ్గు నాణ్యతకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పి గెలుపొందిన జె.సాగర్, ఎస్.రాజేష్, ఎస్. రంజిత్ లకు గని అధికారులు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ ఇంచార్జి ఎండి.ముస్తఫా, ఫిట్ ఇంజనీర్ రాంబాబు, వెంటిలేషన్ అధికారి పూర్ణ చందర్, ఇంజనీర్ రామ్ సాగర్, సంక్షేమ అధికారి శ్రీనివాసరావు, టీబీజీకెఎస్ ఫిట్ సెక్రటరీ దాసరి శ్రీనివాస్, ఏఐటీయూసి ఫిట్ సెక్రటరీ దాసరి తిరుపతి గౌడ్, గని అధికారులు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులపై ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడాలి

### సిఐటియు, భవన నిర్మాణ కార్మికుల మండల నాయకుల డిమాండ్



బోనకల్, నవంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి : భవన నిర్మాణ కార్మికుల పట్ల తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ఎస్కే ఖాదర్ బాబా (బుజ్జి), సిఐటియు మండల కన్వీనర్ బోయినపల్లి వీరబాబు ప్రభుత్వంపై మండిపడ్డారు. మంగళవారం భవన నిర్మాణ కార్మికుల నిరసన కార్యక్రమం సిఐటియు మండల కన్వీనర్ బోయినపల్లి వీరబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అధికారంలోకి వచ్చాక వారిపై వివక్షత చూపుతున్నారని వారు మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్, నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని,ఇప్పటివరకు ఉపాధి కోల్పోయిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ. 10వేలు ఇవ్వాలని, 60 సంవత్సరాలు పైబడిన భవననిర్మాణ కార్మికులందరికీ నెలకు 6000 పింఛన్ మంజూరు చేయాలని, అనేక సందర్భాల్లో ఆందోళన కార్యక్రమాలు చేసినా స్పందించలేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని, అదేవిధంగా ద్విచక్ర వాహనాలు కూడా మంజూరు చేయాలని, సంక్షేమ పథకాలు నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా వారికి రావలసిన అన్నింటినీ కూడా పరిష్కరించాలని ఆయన అన్నారు. అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ఎస్.కె ఖాదర్ బాబా(బుజ్జి) మాట్లాడుతూ తక్షణమే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు నుండి అమలు కాకుండా అడ్డుకుంటున్న మెమోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున సమీకరించి ఆందోళనలు చేయవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు గుంటి శ్రీనివాసరావు, ఎస్ కే మీరాసా, పరసగాని శ్రీను, భూక్యా శ్రీను మురళి, గోపి, ఎం లక్ష్మణ్, ఎన్ శ్రీను, తదితర భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## ధారూర్ జాతర వేలం పాటల పార్కింగ్ స్థలం చూపండి

**వేలంపాట బాధితుడు తిరుపతయ్య**



వికారాబాద్ బ్యూరో 15 నవంబర్ ప్రజా పాలన : ధారూర్ జాతరకు సంబంధించి పార్కింగ్ వేలం పాట స్థలాన్ని చూపెట్టాలని వేలం పాటలో స్థలాన్ని దక్కించుకున్న యజమాని తిరుపతయ్య అన్నారు. మంగళవారం ధారూర్ మండల పరిధిలోని స్టేషన్ ధారూర్ గ్రామ పంచాయతీలో పార్కింగ్ స్థలం వేలం పాట నిర్వహించగా దానిని రూ.3 లక్షల 60 వేలకు దక్కించుకున్నామని స్టేషన్ ధారూర్ మాజీ సర్పంచ్ వేలంపాట బాధితుడు తిరుపతయ్య అన్నారు. గ్రామ పంచాయతీలో వేలం పాట నిర్వహించే క్రమంలో పార్కింగ్ ప్రదేశంలో నీటి వసతి, వీధి దీపాలు వేస్తామని అన్నారని కానీ ప్రస్తుతం ఏమి లేవని ఆవేదన వ్యక్తంచేశారు. 15 నుంచి 20 వరకు ధారూర్ జాతర జరుగుతుండగా ఒక రోజు అయిపోయిన స్థలం ఇంకా అప్పజెప్పలేదని, అధికారుల నిర్లక్ష్యం ఉందని అన్నారు. ఒక రోజు సమయం అయిపోగా దాదాపు రూ.1 లక్ష వరకు నష్టం వచ్చిందని,దానిని ఎవరూ భరిస్తారని ప్రశ్నిచారు. గ్రామ కార్యదర్శి దగ్గర ఉండి పనులు చేయించాల్సింది పోయి ఆమె జాడ కన్పిస్తాలేదన్నారు. పార్కింగ్ కోసం స్థలం కూడా ఎక్కువ చూపిస్తామని చెప్పి,ఇప్పుడు కొంచెం స్థలం చూపించడం ఎంటన్నారు. యువకులకు ఉపాధి ఉ ంటుంది అనుకోని పార్కింగ్ స్థలం వేలం పాటలో పాల్గొనట్లు తెలిపారు.

## భారీగా తెరాస పార్టీలో చేరికలు



వేడిపల్లి, నవంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి):ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులైనటువంటి చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్, బీజేపీ నాయకులు భారీగా టీఆర్ఎస్ పార్టీలో చేరారు. టీఆర్ఎస్ (బి.ఆర్.ఎస్) పార్టీ సీనియర్ నాయకులు పిట్టల నరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి సమక్షంలో మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్ కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులుమారపాక సాయిలు,రామంచర్ల బలరాం,పల్నాటి కిష్టయ్య,జెక్కి నరసింహ, కొండ్ర రాములు,కొంగరి రామచందర్, పొడిచేటి కృష్ణ,పడిగం రామనర్సయ్య మచ్చ ఆరోగ్యం,గంగారం అంజయ్య, బొల్లాపల్లి శ్రీను,కొండ్ర కనకరాజు,నరసింహ మారేపాక నాగయ్య, బీజేపీ యువజన నాయకులు ఫొటోలు రాజులు మరియు వారి మిత్రబృందం యాభై మందికి ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పల్లె నర్సింగరావు,తెరాస సీనియర్ నాయకులు గుడి మధుసూదన్ రెడ్డి, ఈరెల్లి రవీందర్ రెడ్డి,కొంపల్లి రవీందర్ ముదిరాజ్,శనిగరం తిరుమలేష్,వేముల పరమేష్,కొంపల్లి రాజకుమార్, డివిజన్ యూత్ అధ్యక్షులు సీత రాజు యాదవ్,నిల విజయ్,యేసరిని నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహా మండలి పడి పూజా మహోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



మంచిర్యాల టౌన్, నవంబర్ 15, ప్రజాపాలన : మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ లోని శ్రీ విజయ గణపతి దేవాలయం ఈ నెల 27 న ఠాగూర్ స్టేడియంలో జరిగబోయేనటువంటి అయ్యప్ప స్వామి మహా మండలి పడి పూజా మహోత్సవ కరపత్రాన్ని, పోస్టర్ ను జిఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ రాజ రమేష్ బాబు, అయ్యప్ప స్వామి బృందం సమక్షంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ రమేష్ , అయ్యప్ప స్వాములు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మహా మండలి పూజ కార్యక్రమాన్ని జిఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరగబోతుందని రామకృష్ణాపూర్ పట్టణ పరిసరాల ప్రాంతం లోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆ అయ్యప్ప స్వామి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ మహా పడిపూజని విజయవంతం చేయాలని పట్టణంలోని వివిధ ఆలయాల కమిటీలకు, భక్తులకు, పట్టణవాసులకు పిలుపునిచ్చారు. అయ్యప్ప స్వాములు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని మహా పడిపూజ మహోత్సవం విజయం వంతం చేయాలని కోరారు.

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు కలిసిన జడ్పిటిసిలు కామిరెడ్డి శ్రీలత, పోషం నరసింహారావు.పినపాక నియోజకవర్గ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు



బూర్గంపాడు ( ప్రజాపాలన. ):ఈరోజు హైదరాబాద్ ప్రగతి భవన్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ %ు% పినపాక శాసనసభ్యులు %ు% భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీ రేగా కాంతారావు ని మర్యాదపూర్వకంగా కలిసిన.... మణుగూరు జడ్పిటిసి పోశం నరసింహారావు, బూర్గంపాడు జడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత , మణుగూరు మండలం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముత్యం బాబు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కామిరెడ్డి రామ కొండారెడ్డి, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ శ్రీ రేగా కాంతారావు తో పార్టీ నాయకులు ప్రత్యేక సమావేశమై అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను గురించి మరియు తదితర అంశాల మీద సుదీర్ఘంగా చర్చించడం జరిగినదని వారు తెలియజేశారు. పినపాక నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కోట్లాది రూపాయల నిధులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేపించి అభివృద్ధి చేస్తానని మరియు ఇప్పటికే ఏజెన్సీ గ్రామాలలోని మారుమూల గ్రామాలకు సైతం రహదారుల నిర్మాణం సంబంధించి పనులు జరుగుతున్నాయని, అదేవిధంగా చెక్ డ్యామ్ లు, కల్వర్టులు, బ్రిడ్జిలు, రోడ్లు లు, సంబంధించి నిధులు కూడా మంజూరు అవుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ శ్రీ రేగా కాంతారావు ,నాయకులకు వారు తెలియజేసారని తెలిపారు.

## క్రీడా ప్రాంగణ స్థలాలను సందర్శించిన జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు




జన్నారం నవంబర్ 15 ప్రజాపాలన మంచిర్యాల జిల్లా పంచాయితీ అధికారి నారాయణరావు మంగళవారం జన్నారం మండలంలోని కవ్వాల్, హాస్టల్ తండా, కొత్తపేట్, సింగరాయిపేట్ గ్రామ పంచాయితీకి సంబంధించి తెలంగాణ క్రీడ ప్రాంగణ స్థలాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని పూర్తిస్థాయిలో నిర్మాణం కానీ క్రీడా ప్రాంగణములను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుణరాణి, ఎంపీఓ రమేష్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ మధిర గోల్డ్ ఆధ్వర్యంలో బియ్యం వితరణ




మధిర రూరల్ నవంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం నాడు ఆర్కే ఫౌండేషన్ లో పలువురికి 25 కేజీల బియ్యం వితరణమన్నెపల్లి శరత్ కుమార్, హరిణి కుమార్తె పుట్టినరోజు సందర్భంగా నాయనమ్మ తాతయ్య రత్నకుమారి వరప్రసాద్ ఆర్థిక సహాయంతో ఆర్కే ఫౌండేషన్ మధిర అనాధ ఆశ్రమానికి 25 కేజీల బియ్యం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు చారుగుండ్ల వెంకట లక్ష్మీ నరసింహారావు మాట్లాడుతూ తమ మనుమరాలు కీర్తన చిన్న వయసులో పుట్టినరోజు వేడుకల సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించినందుకు రత్నకుమారి, వరప్రసాద్ ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే కీర్తన నిండు నూరేళ్లు అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో పదిమందికి ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు లయన్ చారుగుండ్ల వెంకటలక్ష్మి నరసింహారావు, కార్యదర్శి లయన్ కుంచం కృష్ణారావు, లయన్ వనమా కిరణ్ కుమార్, లయన్ మహంకాళి వెంకట శ్రీనివాసరావు, వనమా వేణుగోపాలరావు (సూరి) ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు, దోర్నాల రామకృష్ణ, దోర్నాల జ్యోతి పాల్గొనడం జరిగింది.

## అర్ధరాత్రి సిటీవో అధికారులు తనిఖీలు...



పాలేరు నవంబర్ 15 ప్రజా పాలన ప్రతినిధి: నేలకొండపల్లిమండల కేంద్రంలో అర్ధరాత్రి కమర్షియల్ ట్యాక్స్ అధికారులు విస్తృతంగా తనీఖీలు చేపట్టారు. సోమవారం అర్ధరాత్రి మండలకేంద్రలలో వాహనాలు ఆపి పత్రాలను తనీఖీలు చేపట్టారు. ఒక్కసారిగా వాహనాలు ఆపి తనీఖీలు చేపట్టటంతో సెంటర్ ఏం జరుగుతుందోననిఆందోళన చెందారు. కమర్షియల్ అధికారులు వాహనాలను ఆపి అందులో ఉన్న సరుకులకు తగినట్లుగా పత్రాలు ఉంటేనే వాహనాలనుపంపించారు. ఈ సందర్భంగా సీటీవో అధికారి ధశరద్మాట్లాడుతూ...ఉన్నాతాధికారులు ఆదేశాలు మేరకు రాష్ట్ర వ్యాప్తంగాతనీఖీలు చేపట్టినట్లు తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు బృందాలు, గా విడిపోయి, తనీఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఆయన వెంట పలువురు అధికారులు పాల్గొన్నారు.

## మాల మహానాడు మండల కన్వీనర్ నియామాకం



శంకరపట్నం నవంబర్ 15 ప్రజాపాలన :మాల మహానాడు జాతియ అధ్యక్షుడు అద్దెంకి దయాకర్ఆదేశాల మేరకు శంకర పట్నం మండలం మాల మహానాడు అడాక్ కమిటి కన్వినర్ గా బూర్ల మొగిలి( వంకాయగూడెం) ని నియమించినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య ప్రకటించారు. ఈ మేరకు పత్రిక ప్రకటన విడుదల చేసారు. ఇట్టి నియమకం ఈ రోజు నుండే అమల్లోకి రానుందని ఆయన తెలియపరు ఇప్పటినుండి మూడు నేలల లోపు మండలం లోని అన్ని గ్రామాల్లో గ్రామస్థాయి కమిటీల నియమకం జరగాలని ఆయన ఆదేశించారు. ఆ తరువాతే పూర్తి స్థాయి మండల కమిటి నియామకం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో మాల మహానాడు రాష్ట్ర ప్రచార కార్యదర్శి తాళ్ల వెంకటేష్,జిల్లా కన్వినర్ కాడే శంకర్,కో కన్వీనర్ ఏలుక ఆంజనేయులు,దామెర సత్యం,మండల నాయకుడు బక్కి రాజు తధితరులు పాల్గొన్నారు. తనును మండల అడక్ కమిటి కన్వినర్ గా నియమించిన జాతీయ అధ్యక్షుడు అద్దెంకి దయాకర్ కు రాష్ట్ర ప్రదాన కార్యదర్శి మేడి అంజయ్య కు కృతజ్ఞతలు తెలిపాడు మాలల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తానని బూర్ల మొగిలి తేలిపారు.


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

**బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు**

| | | |
|---|---|---|
| నరోత్తమ్‌రెడ్డి | మేడిపల్లి | 9346970159 |
| వెంకటస్వామి | మంచిర్యాల | 9515048103 |
| ఎం. గైబులు | వికారాబాద్ | 9704570475 |
| టి.రాంబాబు | శేర్లింగంపల్లి | 6301925113 |
| సత్య కిషోర్ | అమీర్‌పేట | 6309723472 |
| బోడ మనోహర్ నంద | కరీంనగర్ | 9492927684 |
| రాజేందర్ ప్రసాద్ | ఖమ్మం | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | మధిర | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | పాలేరు | 9848895405 |
| పసుపులేటి ఈశ్వర్‌తేజ | మధిర రూరల్ | 6305269141 |
| ఆర్.శ్రీనివాస్ | ఎర్రుపాలెం మండలం | 8501020885 |
| బుక్య.శ్రీను | బోనకల్ | 8688810293 |
| సి.మల్లేష్ | ఇబ్రహీపట్నం | 9618028334 |
| దుంపాల రాజేష్ | మేడ్చల్ | 9000178307 |
| వై.నర్సింహులు | తాండూరు | 7207677049 |
| టి.సురేష్ చారీ | ఆసిఫాబాద్ | 9000983108 |
| డి.భాస్కర్ | బెల్లంపల్లి | 9440018863 |
| ఐ.నర్సింహయ్య | జన్నారం రూరల్ | 9493314399 |
| గొట్టె సురేందర్ | మంచిర్యాల టౌన్ | 9248528680 |
| గొడ్లబాబూరావు | తల్లాడ | 9848236015 |
| ఎల్.వెంకట్ | మందమర్రి | 8106891666 |
| మహమ్మద్ హఫీజుద్దీన్ | కేతనపల్లి | 9701844456 |
| సాయిబాబు | భద్రాద్రి కొత్తగూడెం | 9603149645 |
| ఎన్.బండయ్య | చేవెళ్ల | 9959032940 |
| నరేందర్ | చేవెళ్ల | 9490148304 |
| ఎం.పరమేష్ | శంకరపల్లి | 7989723793 |
| ఊదిరి మహేష్ | చౌటుప్పల్ | 9550941419 |
| జి.అర్జున్ | శంకరపట్నం | 7386777544 |
| ఎం.యాదయ్య | చేవేళ్ల నియోజకవర్గం | 8328236516 |
| ఎం.మురళీ | షాబాద్ | 9989770468 |


## ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: ట్రాఫిక్ సిఐ మక్బూల్ జానీ




మేడిపల్లి, నవంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి):ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఉప్పల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మక్బూల్ జానీ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్లోఏఐటీయుసీ నేత, క్యాబ్ డ్రైవర్స్ జేఏసీ కో చైర్మన్ టి.రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన యంగ్ మెన్ సెవెన్ సీటర్ అసోసియేషన్, ఏఐటీయుసీకి అనుబంధ సంస్థగా చేరుతున్న సందర్భంగా ఉప్పల్లో ఏఐటీయుసీ జెండా ఆవిష్కరణ, ఆటో కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మక్బూల్ జానీ, ఎస్సై చిరంజీవి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు క్రమశిక్షణ పాటించాలని, ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలని సూచించారు. డ్రైవర్లు విధిగా తమ గుర్తింపు కార్డులు వెంట ఉంచుకోవాలని, ఆపద సమయంలో అవి ఉపయోగపడతాయని తెలిపారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరవేయాలని పేర్కొన్నారు. రోడ్డు భద్రత వరోత్సవాలలో ఆటో డ్రైవర్లు కూడా భాగస్వామ్యం కావాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులకు ఆటో డ్రైవర్లు సహకరించాలని, పోలీసులు విధి నిర్వహణలో మనకు చేయూత అందిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగాసుమారు 70 మంది ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాంగ్ మ్యాన్ 7 సీటర్ అనుబంధ సంస్థ ఏఐటియుసి యూనియన్ నాయకులు బి, వెంకటేశం, ఎం, కొండల్ రెడ్డితిరుమలేష్ గౌడ్, ఉప్పల్ యాంగ్ మెన్ సెవెన్ సీటర్ అసోషియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, గౌరవ అధ్యషుడు రమేష్, పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఘనంగా ఆవునూరి రామనారాయణ జన్మదిన వేడుకలు



మధిర నవంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలోని మంగళవారం నాడు. రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, సోషల్ వర్కర్ ఆవునూరి రామనారాయణ 75వ జన్మదినం వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక వర్తకసంఘం భవనం నందు అయ్యప్ప స్వామి మాల ధరించిన స్వాములకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్పు స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత, కార్యదర్శి గుడిమెట్ల మోహనరావు, సహాయ కార్యదర్శి కోయ్యల అరుణ, సభ్యులు ఆవునూరి రామనారాయణ, ఆవునూరి వెంకట్రావమ్మ, ఆవునూరి ప్రవీణ్ కుమార్, ఆవునూరి కాళహస్తి, ఆవునూరి సామ్రాజ్యం, ఆవునూరి దత్తగురు, ఆవునూరి వెంకట రమణ, ఆవునూరి అనసూర్య, అన్నవరపు శ్రీను, అన్నవరపు లక్ష్మీ, కొయ్యల జానకి రాములు, కోయ్యల రాకేష్, నవతెలంగాణ సిబ్బంది ఈ.వెంకటేశ్వరరావు, తాల్లూరి నాగేశ్వరరావు, మల్లికార్జున్, మనం రిపోర్టర్ అరుణ్, సిఐటియు ఆర్టీసీ యునియన్ సెక్రటరీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడలో సకల సౌకర్యాలతో సమీకృత శాఖహారా మాంసాహార మార్కెట్: మేయర్ జక్క వెంకట్ రెడ్డి



మేడిపల్లి, నవంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి)పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు సకల సౌకర్యాలతో సమీకృత శాఖహారా, మాంసాహార మార్కెట్ ను ఏర్పాటు చేస్తున్నామని మేయర్ జక్క వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు నాణ్యమైన,నరసమైన ధరలకే ఆహారం అందించాలనే లక్ష్యంతో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిదిలో సుమారు రూ. ?7.50 కోట్లతో నిర్మితమవుతున్న సమీకృత శాఖహారా, మాంసాహార మార్కెట్ నిర్మాణ పనులను మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ నగర ప్రజలకు తాజా కూరగాయలు, ఆకుకూరలు,పండ్లు,పూలతో పాటు మాంసం ప్రియులకోసం ప్రత్యేకంగా మటన్, చికెన్, చేపలు,రొయ్యలు మొదలైనవన్ని ఒకేచోట అందించాలనే లక్ష్యంతో అందరికి అందుబాటులో అత్యాధునిక హంగులతో సమీకృత శాఖాహార, మాంసాహార మార్కెట్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఇలా ఒకవైపు ప్రజలకు మౌళిక సదుపాయల కల్పనకు పెద్దపీట వేస్తూ, మరోవైపు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నగరాన్ని ప్రణాళికబద్దంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొడె పోచయ్య, డీఈ శ్రీనివాస్, ఏఈ వినీల్ కుమార్,నాయకులు జావీద్ ఖాన్, కాంట్రాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ స్టార్ కృష్ణ మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం



మధిర నవంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం నాడు మాజీ పార్లమెంట్ సభ్యులు సూపర్ స్టార్ కృష్ణ కృష్ణ మరణం తెలుగు చలనచిత్ర రంగానికి తీరని లోటు నియోజవర్గ కృష్ణ అభిమానులు మహేష్ అభిమానులు పలువురు రాజకీయ ప్రముఖులు నాయకులుప్రముఖ నటుడు, నిర్మాత, మాజీ ఎంపీ సూపర్ స్టార్ కృష్ణ మృతి పట్ల పలువురు ప్రముఖులు నాయకులు అభిమానులు తన సంతాపాన్ని ప్రకటించారు నటుడి గా, నిర్మాతగా, నిర్మాణ సంస్థ అధినేతగా తెలుగు సినిమా రంగానికి ఐదు దశాబ్దాల పాటు కృష్ణ అందించిన సేవలను ఈ సందర్భంగా అభిమానులు పలువురు ప్రముఖులు మాట్లాడుతూ మాజీ మాజీ పార్లమెంట్ సభ్యుడిగా నిర్మాతగా ప్రజలు మనుషులు దోచుకున్న వ్యక్తిని , 350 పైగా సినిమాల్లో నటించడమే కాకుండా అల్లూరి సీతారామరాజు గా సినీ ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు అలానే రాజకీయ రంగంలో కూడా ప్రజల మద్దతు తో ఎంపీగా ఎన్నికై ప్రజలకు సేవలు అందించారని అలాంటి గొప్ప మనిషిని కోల్పోవడం బాధాకరమన్నారు నియోజవర్గ ప్రజలు అభిమానులు రాజకీయ ప్రముఖులు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## పట్నంను అభివృద్ధి దిశలో తీసుకెళ్తా: చైర్మన్ స్రవంతి చందు




ఇబ్రహీంపట్నం నవంబర్ తేదీ 15ప్రజాపాలన ప్రతినిధి తెలంగాణ ఛాంబర్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసుకొని మున్సిపాలిటీల అభివృద్ధి కొరకై పలు కీలక అంశాలపై చర్చించి మున్సిపల్ శాఖ మంత్రివర్యులు కేటీఆర్ తెలియజేయవలసిందిగా కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగింది. పాల్గొన్న రాష్ట్ర తెలంగాణ ఛాంబర్ ఛైర్మెన్ వెన్ రెడ్డి రాజు,రాష్ట్ర కార్యదర్శి కప్పరి స్రవంతి చందు కార్యవర్గ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ. ఇబ్రహీంపట్నం మున్సాల్ ను మరింత అభివృద్ధి చేసే విధంగా కృషి చేస్తానని ఆమె తెలిపారు.

## పది లక్షల ప్రమాద బీమా చెక్కును అందించిన బెల్లంపల్లి ఎస్ బి ఐ మేనేజర్



బెల్లంపల్లి నవంబర్ 14 ప్రజా పాలన ప్రతినిధి: ఐదు రూపాయలతో ప్రమాద బీమా పాలసీ చేస్తే ప్రమాదవశాత్తు మరణిస్తే మరణించిన కుటుంబ సభ్యులకు 10 లక్షల రూపాయల ప్రమాద బీమా వర్తిస్తుందని, బెల్లంపల్లి స్టేట్ బ్యాంకు మేనేజర్ బుచ్చయ్య అన్నారు. సోమవారం ప్రమాద బీమా చెక్కును అందించిన అనంతరం ఆయన మాట్లాడారు,తాండూరు మండలం బోయపల్లి కి చెందిన దాసరి రిషికేష్ గౌడ్, రెండు నెలల క్రితం బెల్లంపల్లి బజాజ్ ఏరియాలోని స్టేట్ బ్యాంకులో 500 రూపాయలతో ప్రమాద బీమా చేశాడని, దురదృష్టవశాత్తు ఇటీవల ప్రమాదంలో మరణించగా, రిషికేష్ గౌడ్ తల్లి దాసరి మౌనికకు సోమవారం 10 లక్షల రూపాయల చెక్కును అందించామని ఆయన తెలిపారు, ప్రతి ఒక్కరూ 500 రూపాయలతో ప్రమాద బీమా చేస్తే అనుకోని సంఘటన జరిగినప్పుడు కుటుంబ సభ్యులకు భీమా డబ్బులు ఆదుకుంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది శ్రావణ్, ఆక్టేమ్, మహేష్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## ధరణి లోని సందేహాల నివృత్తి కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు.:జిల్లా కలెక్టర్ భారతి హొళ్లికేరి



మంచిర్యాల బ్యూరో , నవంబర్ 14, ప్రజాపాలన :భూ సమస్యల పరిష్కారం, క్రమబద్ధీకరణ కొరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ధరణి పోర్టల్ దరఖాస్తులలో సందేహాల నివృత్తి కొరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ భారతి హొళ్లికేరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధరణి పోర్టల్ లో 33 మాడ్యూల్స్ లో భూములకు సంబంధించిన వివిధ రకాల సమస్యల పరిష్కారం కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, జిల్లాలోని రైతులు ధరణి పోర్టల్ లో దరఖాస్తు చేసుకొనుటకు వివరాలపై ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే కార్యాలయ పని వేళలలో హెల్ప్ డెస్క్ లో సంప్రదించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ఫోటోగ్రాఫర్ల ఫోటో ట్రేడ్ ఎక్స్పో పండుగను విజయవంతం చేయాలి



చౌటుప్పల్, నవంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి):చౌటుప్పల్ మండలం లోని ఫోటోగ్రాఫర్స్ అందరూ ఈరోజు మార్కెట్ యార్డ్ లో హైదరాబాదులో జరిగే ఫోటోగ్రాఫర్ల ఫోటో ట్రేడ్ ఎక్స్పో కు సంబంధించిన వాల్ పోస్టర్లను వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆవిష్కరణ చేయడం జరిగింది చౌటుప్ప మండల ఫోటోగ్రాఫర్ల అసోసియన్ అధ్యక్షుడు తూర్పునూరి సాయిలు, మాట్లాడుతూ తెలంగాణలో జరిగే అతిపెద్ద ఫోటోగ్రాఫర్ల ఫోటో ట్రేడ్ ఎక్స్పో పండుగను విజయవంతం చేయాలని ఫోటోగ్రాఫర్లు అందరూ తరలి రావాలని కోరారు ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్లు మెట్టు రామచంద్రారెడ్డి, తరపునూరు మల్లేష్, పగడాల శంకర్, రాంబాబు, లక్కు సతీష్, కందగట్ల కృష్ణ, భారత మధు, నాని, మాధవాచారి, తదితరులు పాల్గొన్నారు,

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందచేత



చౌటుప్పల్, నవంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి):చౌటుప్పల్ మున్సిపాలిటీ లక్కారం గ్రామానికి చెందిన నందగిరి సుగుణమ్మ భర్త రాములుకి అనారోగ్య ఉండటం వలన హాస్పిటల్ ఖర్చులు నిమిత్తము మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి సిపార్స్ మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు 20వేల రూపాయలు వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ సుర్కంటి నవీన్ కుమార్ రెడ్డి చెక్కు అందజేశారు డైరెక్టర్ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సీఎం చంద్రశేఖర రావు పేదలకు ఆరోగ్యం కోసం అధికంగా నిధులను ఖర్చు చేస్తున్నారు ఆరోగ్య తెలంగాణ తన లక్ష్యంగా పనిచేస్తున్నారు అని అన్నారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్ రెడ్డి, నాయకులు ఏనుగు నర్సిరెడ్డి, కానుగు ప్రవీణ్, గుండెబోయిన సతీష్, పెద్దిరెడ్డి గోపాల్ శివ, అంకురి భాను, తదితరులు పాల్గొన్నారు,

## మెడిసిన్ సీట్ సాధించిన విద్యార్థులకు సన్మానం



మంచిర్యాల టౌన్, నవంబర్ 14, ప్రజాపాలన: మెడిసిన్ లో సీట్ సాధించిన రామకృష్ణాపూర్ విద్యార్థులను బాలల దినోత్సవం సందర్భంగా తవక్కల్ పాఠశాల విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం పాఠశాలలో చదువుకున్న విద్యార్థుల్లో మెడిసిన్ సీట్ సాధించిన విద్యార్థులను, ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు పాఠశాల చైర్మన్ అబ్దుల్ అజీజ్ ప్రిన్సిపల్ రామకృష్ణ శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా తవక్కల్ గ్రూప్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షల్లో జిల్లాకు 11 సీట్లు వస్తే అందులో ఒక తవక్కల్ పాఠశాలలో చదువుకున్న నలుగురికి విద్యార్థులకు రావడం చాలా గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదువుకొని ఉపాధ్యాయులు చెప్పిన విధంగా క్రమశిక్షణతో చదవడం తో సాధించారని అన్నారు. విద్యార్థులు ఉన్నతమైన స్థానంలో ఉండాలని ఉపాధ్యాయులకు వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో ప్రవేశాల కోసం విద్యార్థుల సందడి హైదరాబాద్ 15 నవంబర్ ప్రజాపాలన: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో డిగ్రీ పిజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడానికి చివరి రోజు కావడంతో విద్యార్థులు ఈ విధంగా సందడి చేశారు. నవంబర్ 15 అడ్మీషన్ చివరి రోజు కావడంతో అంబేద్కర్ యునివర్సిటీ లో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులతో సందడి ఏర్పడింది. దరఖాస్తులను నింపడం సర్టిఫికెట్ వెరిఫికేషన్ మరియు కౌంటర్ లో కాలేజీ ఫీజు చెల్లించేందుకు ఉదయం నుండి విద్యార్థులు బారులు తీరారు.

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో ప్రవేశాల కోసం విద్యార్థుల సందడి





హైదరాబాద్ 15 నవంబర్ ప్రజాపాలన: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో డిగ్రీ పిజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడానికి చివరి రోజు కావడంతో విద్యార్థులు ఈ విధంగా సందడి చేశారు. నవంబర్ 15 అడ్మీషన్ చివరి రోజు కావడంతో అంబేద్కర్ యునివర్సిటీ లో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులతో సందడి ఏర్పడింది. దరఖాస్తులను నింపడం సర్టిఫికెట్ వెరిఫికేషన్ మరియు కౌంటర్ లో కాలేజీ ఫీజు చెల్లించేందుకు ఉదయం నుండి విద్యార్థులు బారులు తీరారు.

## దాతల సహాయం కోసం ఎదురుచూపు



చౌటుప్పల్, నవంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి): చౌటుప్పల్ మండలం ఎస్. లింగోటం చెందిన పిట్టల తరుణ్ సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, చికిత్స నిమిత్తం ఒక కాలును పూర్తిగా తీసివేయడం జరిగింది. సర్జరీ కోసం ఇంకా పది లక్షల రూపాయలు అవసరమవుతుండగా, నిరుపేద కుటుంబానికి చెందిన పిట్టల తరుణ్ ని ఆదుకోవాలని, దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. మానవత్వంతో స్పందించే దాతలు ఎవరైనా తండ్రి పిట్టల కుమార్ 9704752623 నంబరును సంప్రదించగలరని కోరుతున్నారు.

## న్యూట్రిషన్ అండ్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్ మొబైల్ అప్లికేషన్ శిక్షణ





హైదరాబాద్ 15 నవంబర్ ప్రజాపాలన: న్యూట్రిషన్ అండ్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్ మొబైల్ అప్లికేషన్‌ను మరింత సమర్థవంతంగా మరియు పారదర్శకంగా అందించడానికి అంగన్‌వాడీ టీచర్లు మరియు సూపర్‌వైజర్లు సరైన రీతిలో ఉపయోగించుకోవాలని శిక్షణ పొందారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రాజెక్ట్‌లో గ్రోత్ కార్డ్ శిక్షణ మరియు న్యూట్రిషన్ అండ్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్ %చీఋా% యాప్ శిక్షణ, అంగన్‌వాడీ డే రిజిస్టర్ నిర్వహించడం తదితర శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు.

# మున్సిపల్ ఉద్యోగ కార్మికుల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



ఇబ్రహీంపట్నం నవంబర్ తేదీ 15ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుభందం) రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఈ రోజు తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయంలో ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గోడ పత్రిక ను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి డి. కిషన్ మాట్లాడుతూ. మున్సిపల్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్లో మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్నట్టుగా తెలంగాణ రాష్ట్రంలో కూడా కార్మికులకు రూ. 21 వేల వేతనం చెల్లించాలన్నారు, అంతేకాకుండా ఈఎస్ఐ ఇపీఎఫ్ లలో జరుగుతున్న అవకతవకలపై సమగ్రమైన విచారణ జరపి కార్మికులకు న్యాయం చేయాలన్నారు కార్మికులందరికీ వారాంతపు సెలవులు రక్షణ పరికరాలు సకాలంలో అందజేయాలని డిమాండ్ చేశారు. కరోనా కాలంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న అత్యధికలు దళిత కుటుంబాలకు చెందిన వారేనని అందువల్ల దళిత బంధు పథకం ప్రతి మున్సిపల్ కార్మికునికి వర్తింపజేయాలని అన్నారు. ఈ నేపథ్యంలో హనుమకొండలో జరగనున్న తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ మహాసభల్లో కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రధాన ఎజెండాగా చర్చించనున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షులు మేతరి దాసు సి. నవీన్ కార్మికులు మేతరి నవీన్ చెక్క శివ, వర్మ , రాజు, జాఫర్,రమేష్, కుమార్, సరిత అండాలు, శోభ, తదితరులు పాల్గొన్నారు,

## సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో తాసిల్దార్‌కు వినతిపత్రం





ఇబ్రహీంపట్నం నవంబర్ తేదీ 15 ప్రజాపాలన ప్రతినిధి: అబ్దుల్లాపూర్మెట్ మండల కేంద్రంలో తొలగించిన గుడిసె వాసులు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి నాయిబ్ తాసిల్దార్ కి మేమురండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా సిపిఎం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య , ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, 40 రోజులుగా గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న నిరుపేదల్ని, రెవిన్యూ అధికారులు, పోలీసు బలగాలతో నిర్బంధంగా లీడర్లని అరెస్టు చేసి మహిళలు అని కూడా చూడకుండా లాఠీ ఛార్జ్ చేసి గుడిసెలు తొలగించడానికి సరి అయినది కాదని అన్నారు. గుడిసెలు తొలగించడానికి, స్థానిక ఎమ్మెల్యే ప్రధాన కారణమని, ఈ మండలంలో ప్రభుత్వ భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు కబ్జా చేసి అమ్ముకుంటున్న వారి పైన కేసులు పెట్టని అధికారులు. 60 గజాల కోసం తలదాచుకోవడానికి కుర్చీలు వేసుకుంటే గుడిసెలు తీసివేసి కేసులు పెడుతున్నారు. ఎన్నిసార్లు గుడిసెలు కూడా తీసిన అన్నిసార్లు గుడిసెలు వేస్తూనే ఉంటామని దానికి అర్హులైన పేదలందరి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఏర్పుల నరసింహ, మండల కమిటీ సభ్యులు గుండె శివ, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కనకయ్య, బీఎస్పీ జిల్లా నాయకులు చిత్రం కృష్ణ బిక్షపతి, చిత్ర శివ అనిత, లలిత, జీవిత, సౌజన్య, మైసమ్మ,, వసంత,, యాదయ్య, మండల కార్యాలయం ముందు ధర్నా చేసి అనంతరం భీమవరంలో ఇవ్వడం జరిగింది.

## కళాకారులను మధిర అడ్డాగా ప్రజలు ఎప్పుడు ఆదరిస్తారు జడ్పీపీ చైర్మన్ లింగాల



మధిర నవంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో రామ భక్త సీతయ్య. కళాపరిషత్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక వెంకటేశ్వవర స్వామి కళ్యాణ్ మండపంలో ఏర్పాటు చేసిన బాలల దినోత్సవ సందర్భంగా ముఖ్యఅతిథి లింగాల కమల్ రాజు పాల్గొని జ్యోతి ప్రరజ్వవల పాల్గొన్నన అనంతరంరామభక్త సీతయ్య కళా పరిషత్ నిర్వాహకులకు అభినందనలుమధిర లో 25వ జాతీయ స్థాయి మధిర బాలోత్సవ్ 2022 కార్యక్రమాన్ని ప్రారంభించిన జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజుకళా రంగంలో రాణిస్తున్న కళాకారులను మధిర ప్రాంత ప్రజలు ఎప్పుడు ఆదరిస్తూనే ఉంటారని జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు గారు పేర్కొన్నారు మంగళవారం నాడు మధిర పట్టణంలో బంజారా కాలనీ శ్రీ వేంకటేశ్వరస్వామి కళ్యాణ మండపంలో రామభక్త సీతయ్య కళా పరిషత్ వ్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మధిర బాలోత్సవ్ 2022 కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా మధిర లో పలు కార్యక్రమాలు నిర్వహించాడం తో పాటుగా అందరూ కళాకారులను ప్రోత్సహిస్తూ ఇతర ప్రాంతాల్లో ఎక్కడ కళారంగ కార్యక్రమాలు జరిగిన వెల్లి అందులో పాల్గొని మన మధిర కు అవార్డులు తీసుకొస్తున్న కళాకారులకు మధిర ప్రజలు అండగా ఉంటారని తెలిపారు ముఖ్యంగా రామభక్త సీతయ్య కళా పరిషత్ నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నిర్వహుకులు పుతుంబాక కృష్ణప్రసాద్ బాబూరావు (బాబ్లు), ఎంపీపీ మెండెం లలిత మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు మండల పార్టీ అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు గడ్డం సుబ్బారావు అప్పారావు మాధవి కౌన్సిలర్ కృష్ణమూర్తి సహా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు .

## నవంబర్ 15న భారతదేశంలోని గ్రామాలలో రైతు సంఘం జండా దినోత్సవం



ఇబ్రహీంపట్నం నవంబర్ తేదీ 15ప్రజాపాలన ప్రతినిధి: ఎల్ కె ఎస్ విప్లవకారుడు బిర్సా ముండా జనంతో నవంబర్ 15న భారతదేశంలోని గ్రామాలలో రైతు సంఘం జండా దినోత్సవం నిర్వహించాలని అఖిల భారత రైతు సంఘం పిలుపు నిచ్చింది. బ్రిటిష్కు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఆదివాసి న వీరున్ని సంస్మరణ దినోత్సవం సందర్భంగా లక్షకు పైగా గ్రామాల్లో రైతు సంఘం జెండాలు, ఎగుర వేయాలి, అందులో భాగంగ. యాచారం అ తెలంగాణ రైతు సంఘం జండా జిల్లా కార్యదర్శి ఎగరు వేసి మాట్లాడుతు. కేంద్ర ప్రభుత్వం పాఠమె.. సమావేశాల్లో అటవీ సంరక్షణ నియమాలు – 2022 పేరుతో ప్రవేశపెడుతున్న సవరణ బిల్లును తక్షణ ఉప సంహరించుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి . బీ. మధుసూదన్ రెడ్డి ఒక ప్రకటన). కొమాండ్ చేశారు. కోట్లాది మంది గిరిజనులను అడవులనుండి గెంటేసి వాటిని కార్పొరేక్షకు కట్టబెట్టే ప్రమాదకర నిబంధనలు తీసుకొస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా షెడ్యూల్ విలువైన మైనింగ్, ఖనిజ సంపదను అంబానీ, ఆదాని, వంటి కార్పొ తీట్లకు కట్ట బెట్టేం. శుకీ ఈ బిల్లును. తీసుకొస్తున్నదని వివరించారు. ఇంకా అనేమైన రైతుల విషయాలు నదరు. ఈకార్యక్రమా సీఎం రైతుసంఘం మాచారం మండల కార్యదర్శి. ఎంనర్మించా మండల నాయకులు ఏ .ఏలమ్మ, ల్. మధుసూదన్ రెడ్డి,బి. శ్రీశైలం జే పంజాసంఘాల నాయకులు అలంపల్లి నర్సింహం, రమేష్ ఎం. సత్యనారాయణ, ఎం. సతయ్య, కె. శేఖర్, జి. మందగ్గరి తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 18న కన్వా శాంతి వనంలో పంచగవ్య మహాసమ్మేళనం..



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ):గోవు ఆధారిత పంచ గవ్యాల వైద్యం పై ప్రజలలో మక్కువ పెరుగుతుందన్నారు గురూజీ నిరంజన్ వర్మ. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో పంచగవ్య డాక్టర్సఅసోసియేషన్, అఖిల భారత గోసేవ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ స్వర్గీయ రాజీవ్ దీక్షిత్ గారి జయంతి మరియు వర్ధంతి సందర్భంగా 10 వ పంచగవ్య మహా సమ్మేళనం ను కన్వా శాంతి వనం లో ఈ నెల 18 నుండి 20 వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఈ సమావేశం లో దేశవ్యాప్తంగా ఉన్న పంచగవ్య డాక్టర్ లు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అవగాహనా సదస్సు తదనంతరం వాక్ ఫర్ గోమాత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో గురూజీ నిరంజన్ వర్మ,తెలంగాణ రాష్ట్ర పంచగవ్య డాక్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీమతి ఇందుమతి ఉద్దరాజు, మురళీధర్, చంద్రస్వామి, యోగేష్ ప్రభు,జీగ్నేష్,కల్పనా గాయత్రి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ స్మారక ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేత



చౌటుప్పల్, నవంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి):రాజీవ్ స్మారక ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రావుల మాధవరెడ్డి మరియు దేవులమ్మ నాగారం మాజీ ఎంపీటీసీ మల్కాపురం నరసింహ సూచన మేరకు చౌటుప్పల్ మండలంలోని దేవలమ్మ గ్రామానికి చెందిన కొత్త బాలరాజ్ కుమారుడు ఇటీవ కలంలో అకాల మరణం సంభవించిన,రాజీవ్ స్మారక ట్రస్ట్ కార్యదర్శి ఎంఏ ఖయ్యూమ్ చేతుల మీదగా 15 వేల ఆర్థిక సాయం చేయడం జరిగింది, అనంతరం ఎంఏ ఖయ్యూమ్ మాట్లాడుతూ రాజీవ్ ట్రస్ట్ నిరుపేదల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో బొమ్మ మైసయ్య పులిగేల రాములు మెరుగు సాయి ఒట్టు రాము కాసుగు యాదయ్య పిన్నింటి జంగారెడ్డి పాల్గొన్నారు,

## జనశిక్షణా అధ్వర్యంలో బిర్సాముండా జయంతి



ఖమ్మం, నవంబర్ 15 (ప్రజాపాలన న్యూస్): జనశిక్షణ సంస్థాన్ ఖమ్మంజిల్లా ఆధ్వర్యంలో మంగళవారం భగవాన్ బిర్సాముండా జన్మదిన వేడుకలను ఖమ్మం అర్బన్ మండలంలోని జయనగర్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, ఖానాపురం తదితర గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. ఆజాది కా అమృత మహెూత్సవ కార్యక్రమంలో భాగంగా జనశిక్షణ సంస్థన్ సెంటర్స్ లలో శిక్షణ పొందుతున్న లబ్ధిదారులతో మీటింగ్ ను ఏర్పాటు చేసి భగవాన్ బిర్సా ముండా వంటి గిరిజన నాయకుల వారసత్వం గురించి అలాగే భారతదేశంలో జనజాతీయ కమ్యూనిటీ యొక్క ఇతర గొప్ప వ్యక్తులు, పాడని వీరుల గురించి జ్ఞానోదయం కలిగించుట జరిగింది. స్వాతంత్ర పోరాటంలో జనజాతీయ సహకారం అనే అంశం పై జె యస్ యస్ లబ్ధిదారులకు మధ్య చర్చా పోటీలు నిర్వహించామని జె యస్ యస్ డైరెక్టర్ వై రాధాకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్, స్టాఫ్, లబ్ధిదారులు,గ్రామ పంచాయతీ పెద్దలు పాల్గొన్నారు.

## డాక్టర్ యెగ్గన శ్రీనివాస్ కు ఎ పి జె అబ్దుల్ కలాం అవార్డు



మంచిర్యాల టౌన్, నవంబర్ 14, ప్రజాపాలన: జిల్లా కేంద్రంలోని ఎయిమ్స్ ఆసుపత్రి అధినేత , వైద్యులు యెగ్గన శ్రీనివాస్ కు ఎ పి జె అబ్దుల్ కలాం అవార్డును ఆక్ట్ నౌ ఫౌండేషన్ హైదరాబాద్ వారు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలోని సేవలకు, శ్రేష్ఠతకు ఎ పి జే అబ్దుల్ కలాం అవార్డును అందుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. పేదలకు సేవలు అందించడమే లక్ష్యంగా చేసుకుని పలు సేవ కార్యక్రమాలు చేయడం చాలా గర్వంగా ఉందని అన్నారు. ఈ అవార్డ్ తన తల్లిదండ్రులకు,జీవిత భాగస్వామి డాక్టర్ సునీత కు అంకితం చేసినట్లు అయన తెలిపారు., అనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతునిచ్చి ఎదుగుదలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

## స్టార్ హీరోయిన్ 'మన్మథుడు 2' దర్శకుడికి ఓకే చెప్తుందా..?



'అందాల రాక్షసి' సినిమాతో హీరోగా తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్న రాహుల్ రవీంద్రన్.. 'టైగర్' 'అలా ఎలా' వంటి మరికొన్ని చిత్రాలతో మెప్పించాడు. ఈ క్రమంలో 'చిలసౌ' చిత్రంతో దర్శకుడిగా మెగాఫోన్ పట్టుకున్నాడు రాహుల్. ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చిన ఈ సినిమా.. రాహుల్ ను డైరెక్టర్ గా సక్సెస్ ఫుల్ గా లాంచ్ చేసింది. ఈ సినిమా బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్ ప్లే విభాగంలో నేషనల్ అవార్డు కూడా అందుకుంది. దీంతో రెండో సినిమాకే సీనియర్ స్టార్ హీరో కింగ్ అక్కినేని నాగార్జునతో వర్క్ చేసే అవకాశం దక్కించుకున్నాడు రాహుల్. అయితే వీరి కలయికలో వచ్చిన 'మన్మథుడు 2' మూవీ డిజాస్టర్ గా నిలిచింది. అంతేకాదు దర్శకుడు ఎన్నో ట్రోల్స్ ఎదుర్కోవాల్సి వచ్చింది. అప్పటి నుంచి మరో చిత్రాన్ని డైరెక్ట్ చేయని హీరో.. ఎప్పటిలాగే నటుడిగా బిజీ అయిపోయాడు. అయితే మళ్ళీ ఛాన్స్ వస్తే మరోసారి సత్తా చాటాలని గట్టిగా ట్రై చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో రాహుల్ రవీంద్రన్ ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ బ్యానర్ లో సినిమా చేసే అవకాశం దక్కించుకున్నాడని సమాచారం. రాహుల్ చెప్పిన లేడీ ఓరియెంటెడ్ సబ్జెక్ట్ నచ్చడంతో.. స్టార్ క్యాస్టింగ్ తో చేయడానికి ముందుకు వచ్చారట. దీని కోసం రష్మిక మందన్నా ని సంప్రదించినట్లుగా ఆ మధ్య వార్తలు వచ్చాయి. అయితే ఇప్పుడు అగ్ర కథానాయిక సమంత రూత్ ప్రభుతో చేసే ఆలోచన చేస్తున్నాడని టాక్ నడుస్తోంది. విడాకుల ప్రకటన తర్వాత సమంత బ్యాక్ టూ బ్యాక్ ఫీమేల్ సెంట్రిక్ సినిమాలకు సైన్ చేస్తూ వచ్చింది. ఆమె లీడ్ రోల్ లో నటించిన 'యశోద' మూవీ ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ క్రమంలో గుణ శేఖర్ దర్శకత్వంలో 'శాకుంతలం' అనే పౌరాణిక సినిమాతో పలకరించబోతోంది.

## ముంబై బిజినెస్ మ్యాన్ తో తమన్నా పెళ్లి?



మిల్కీబ్యూటీ తమన్నా పెళ్లి వార్త కొన్ని రోజులుగా నెట్టింట హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. ఏడాది ఆరంభం నుంచి తమన్నా పెళ్లిపై కథనాలు అంతకంకు హీటెక్కిస్తున్నాయి. పెళ్లి కోడుకు వివరాలు బయటకు రాలేదుగానీ..మిల్కీ పెళ్లాడేస్తుంది.. పిలల్ని కనేస్తుందంటూ ఒకటే దంపుడు మొదలైంది. ఏప్రిల్ నుంచి అక్టోబర్ నెలవరకూ పెళ్లిపై నిత్యం కథలనాలు వైరల్ అవుతూనే ఉన్నాయి. దీంతో తమన్నా అప్పుడున్న పరిస్థితుల్లో సీన్లోకి రాక తప్పలేదు. మీడియా కథనాలకి తగ్గట్లు ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. పెళ్లి విషయంలో తనకు కొన్ని కలలు ఉన్నాయని.. అందరి అమ్మాయిల్లా పెళ్లి చేసుకొని పిల్లల్ని కనాలని ఉందని రివీల్ చేసింది. కుటుంబ సభ్యుల నుంచి కూడా పెళ్లి విషయంలో ఒత్తిడి మొదలైందని నవ్వేసింది. అయితే పెళ్లి ఎప్పుడనే నిర్ణయాన్ని మాత్రం తనకే వదిలివేశారని క్లారిటీ ఇచ్చింది. బిజీ షెడ్యూల్స్ కారణంగా పర్సనల్ లైఫ్ గురించి ఆలోచించే తీరిక లేకపోవడంతో వివాహం గురించి సీరియస్ గా ఆలోచన చేయలేకపోతున్నట్లు తెలిపింది. కేవలం మీడియాలో వస్తోన్న గాసిప్స్ నేపథ్యంలోనే ఈ రకమైన వివరణ ఇచ్చింది. అయితే తాజాగా అమ్మడి పెళ్లి ముంబైకి చెందని ఓ బడా వ్యాపార వేత్తతో కుదిరినట్లు కథనాలు ఊపందుకున్నాయి. ఇది పెద్దలు కుదర్చిన సంబంధం అని..కుర్రాడు బ్యాక్ గ్రౌండ్ కూడా బాగుండటంతో తమన్నా ఒకే చెప్పిందని కోలీవుడ్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. నిశ్చితార్థం..పెళ్లి ముహూర్తాలు చూడటమే ఆలస్యమని గట్టిగానే వినిపిస్తుంది. మరి ఇందులో నిజమెంతో తెలియదు గానీ మరోసారి మిల్కీబ్యూటీ పేరు మాత్రం నెట్టింట రారెత్తిపోతుంది. ఏమీ లేనప్పుడే తమన్నా పెళ్లి గురించి వచ్చిన కథనాలపై వివరణ ఇచ్చే ప్రయత్నం చేసింది. మరి ఈసారి ఏకంగా ముంబై బిజినెస్ మ్యాన్ తెరపైకి వచ్చాడు? మరి ఇందులో నిజమెంత? ఒకవేళ వాస్తవమే అయితే ఆ బడా వ్యాపార వేత్త ఎవరు? అన్నది మాత్రం ఆసక్తికరమే. తమన్నాకి తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఫాలోయింగ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. కుర్రాళ్ల కలల రాణిగా టాలీవుడ్ లో ఓ వెలుగు వెలిగింది. అంతటి అందాల రాణి మనువాడే కుర్రాడు ఎవరో? తెలుసుకోవాలి అన్న ఎగ్జైట్ మెంట్ అభిమానుల్లో సహజమే. మరి మిల్కీ బ్యూటీ పెళ్లి చేసుకుని ఎన్ని హృదయాల్ని గాయపరుస్తుందో చూడాలి.

## ఎన్టీఆర్ కోసం ప్రశాంత్ నీల్ బిగ్ ప్లాన్?



కన్నడ రాకింగ్ స్టార్ యష్ తో 'కేజీఎఫ్' సీరీస్ సినిమాలని తెరకెక్కించి ఒక్కసారిగా వార్తల్లో నిలిచాడు దర్శకుడు ప్రశాంత్ నీల్. తను వార్తల్లో నిలవడమే కాకుండా యష్ ని పాన్ ఇండియా స్టార్ ల సరసన నిలబెట్టి కన్నడ ఇండస్ట్రీ ఇండియా వైడ్ గా చర్చనీయాంశం అయ్యేలా చేశాడు. ఈ సీరీస్ సినిమాలతో దర్శకుడిగా భారీ క్రేజ్ ని సొంతం చేసుకున్న ప్రశాంత్ నీల్ బ్యాక్ టు బ్యాక్ క్రేజీ స్టార్లతో సినిమాలని లైన్ లో పెట్టిన విషయం తెలిసిందే. 'కేజీఎఫ్ 2' తరువాత పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తో ప్రశాంత్ నీల్ తన మార్కు యూనివర్స్ లో తెరకెక్కిస్తున్న హై వోల్టేజ్ యాక్షన్ డ్రామా 'సలార్'. 'కేజీఎఫ్' మేకర్ హొంబలే ఫిలింస్ అధినేత విజయ్ కిరగందూర్ అత్యంత భారీ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. శృతిహాసన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీలో మలయాళ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ జగపతిబాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అత్యంత భారీ బడ్జెట్ తో రూపొందుతున్న ఈ మూవీ ప్రస్తుతం చిత్రీకరణ దశలో వుంది. తెలుగులో రూపొందుతున్న ఈ మూవీని కన్నడలోనూ భారీ స్థాయిలో రిలీజ్ చేయాలని దర్శకుడు ప్రశాంత్ నీల్ హొంబలే ఫిలింస్ అధినేత విజయ్ కిరగందూర్ ప్లాన్ చేస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. పాన్ ఇండియా వైడ్ గా తెలుగు తమిళ కన్నడ మలయాళ హిందీ భాషల్లో 2023 సెప్టెంబర్ 28న భారీ స్థాయిలో రిలీజ్ కు ప్లాన్ చేస్తున్నారు. ఇదిలా వుంటే ఈ మూవీ తరువాత ప్రశాంత్ నీల్ స్టార్ హీరో యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో ఇదే తరహాలో మరో భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ కు శ్రీకారం చుట్టబోతున్నారు.

## వరుణ్ తేజ్ కోసం క్రేజీ హీరోయిన్ రెడీ!

'గని' వంటి భారీ డిజాస్టర్ తరువాత వరుణ్ తేజ్ ఆచితూచి అడుగులు వేస్తున్నాడు. ఈ మూవీ తరువాత ప్రవీణ్ సత్తారు డైరెక్షన్ లో ఓ భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిన వరుణ్ తేజ్ ఈ మూవీతో పాటు తన తొలి పాన్ ఇండియా మూవీకి రెడీ అయిపోయిన విషయం తెలిసిందే. బాక్సర్ కనిపించడం కోసం చాలా శ్రమించిన వరుణ్ తేజ్ 'గని'పై భారీ అంచనాలు పెట్టుకున్నాడు. అయితే ఆ అంచనాల్ని ఏ మాత్రం రీచ్ కాలేక వరుణ్ తేజ్ కు భారీ డిజాస్టర్ ని అందించింది. ఈ నేపథ్యంలో సెలెక్టీవ్ గా సినిమాలు అంగీకరిస్తున్న వరుణ్ తేజ్ .. ప్రవీణ్ సత్తారుతో పాటు మరో కొత్త దర్శకుడికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. శక్తి ప్రతాప్ సింగ్ దర్శకుడిగా పరిచయం కానున్న ఈ మూవీని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ నేపథ్యంలో ఇటీవల జరిగిన పలు యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కించబోతున్నారు. సినిమాలో తొలి సారి వరుణ్ తేజ ఏయిర్ ఫోర్స్ ఆఫీసర్ గా అత్యంత సాహసోపేతమైన పాత్రలో కనిపించబోతున్నాడు. పాన్ ఇండియా లెవెల్లో తెరకెక్కతున్న ఈ మూవీ ద్వారా హీరో వరుణ్ తేజ్ బాలీవుడ్ కు పరిచయం కాబోతున్నాడు. సోని పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్ రినైసెన్స్ పిక్చర్స్ ఈ ప్రాజెక్ట్ ని అత్యంత భారీ స్థాయిలో నిర్మించబోతున్నాయి. కొన్ని రోజుల క్రితమే మేకర్స్ ఈ మూవీని అధికారికంగా ప్రకటించడమే కాకుండా లాంఛనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రెగ్యులర్ షూటింగ్ ని డిసెంబర్ లో ప్రారంభించబోతున్నారని తెలిసింది. వరుణ్ తేజ్ నటిస్తున్న 13వ ప్రాజెక్ట్ ఇది. విటి 13 అనే వర్కింగ్ టైటిల్ తో ఈ మూవీని రూపొందిస్తున్నారు. తెలుగు హిందీ భాషల్లో ఏక కాలంలో రూపొందనున్న ద్విభాషా చిత్రమిది. ఐదు భాషల్లో పాన్ ఇండియా మూవీగా దీన్ని రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఏయిర్ మార్షల్స్ కి సంబంధించిన కథగా దేశ భక్తి నేపథ్యంలో అత్యంత భారీ స్థాయిలో తెరపైకి తీసుకురాబోతున్నారు. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన అభినందన్ వర్ధమాన్ సంఘటన స్ఫూర్తిగా ఈ మూవీ వుంటుందని తెలుస్తోంది.




## మిస్టర్ పర్ఫెక్ట్ ప్రకటనతో బిగ్ షాక్ లో ఫ్యాన్స్



మిస్టర్ పర్ఫెక్ట్ రెండేళ్లు పూర్తిగా సినిమాలకు బ్రేక్ ఇస్తున్నారా? అంటే అవుననే సమాచారం. మిస్టర్ పర్ఫెక్ట్ అనగానే టాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ ప్రభాస్! అంటూ డైలమా అవసరం లేదు. ఇది బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ అమీర్ ఖాన్ గురించిన వార్త. ఖాన్ ల త్రయంలోనే సంచలనాల హీరోగా పాపులరైన అమీర్ ఖాన్ గత కొంతకాలంగా పరాజయాల బాటలో ఉన్నాడు. అతడి డ్రీమ్ ప్రాజెక్ట్ 'లాల్ సింగ్ చడ్డా' బాక్సాఫీస్ వద్ద డిజాస్టరైంది. ఈ సినిమాపై ఎన్నో హోప్స్ తో తన జీవితాన్ని ఆత్మను అంకితమిచ్చి పని చేశాడు. ఎనిమిదేళ్ల నాటి కలను సాకారం చేసుకునేందుకు మూడేళ్ల పాటు రేయింబవళు శ్రమించి ఒక రకంగా తపస్సు చేశాడు. దీనికోసం సొంత ప్రొడక్షన్ హౌస్ భారీగా పెట్టుబడులు పెట్టింది. కానీ పాపం అది డిజాస్టర్ అయ్యి భారీ నష్టాలను మిగిల్చింది. ఈ మూవీ రూపంలో అమీర్ కోట్లలో నష్టపోయారని ప్రచారం సాగింది. ఇది అతడిలో తీవ్ర కలతను పెంచిందన్న గుసగుసా బాలీవుడ్ మీడియాలో వినిపించింది. కారణం ఏదైనా ఇప్పుడు అమీర్ లో బోలెడంత మదనం కొనసాగుతోంది. తాజా సమాచారం మేరకు 'చాంపియన్స్' అనే చిత్రంలో నటించాల్సి ఉందని.. అయితే దానిని విరమించానని దీనికి కేవలం నిర్మాతగా మాత్రమే వ్యవహరిస్తానని అమీర్ ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. అంతేకాదు తాను రెండేళ్ల విరామం తీసుకుని తన కుటుంబంతో గడపాలనుకుంటున్నట్టు వెల్లడించాడు. ముఖ్యంగా అనారోగ్యంతో ఇటీవల ఆసుపత్రిలో చేరిన తన తల్లితో ఈ సమయంలో ఉండాలనుకుంటున్నానని చెప్పాడు. అమీర్ తన పిల్లలతో సరైన సమయాన్ని కూడా గడపలేదని ఈ ఇంటర్వ్యూలో అంగీకరించారు. ఇప్పుడు వారికి తిరిగి ప్రతిదీ అందించే సమయం వచ్చిందని ఈ రెండేళ్లు తన జీవితాన్ని ప్రశాంతంగా గడుపుతానని చెప్పాడు. మొత్తానికి అమీర్ లో మార్పు స్పష్టంగా కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

## అవి విఫలమైతే టిల్లు మ్యాజిక్ చేయడం కష్టమే?



కొన్ని సినిమాలు ఎందుకు బ్లాక్ బస్టర్ లవుతాయో అర్థం కాదు.. కానీ కొనన్ని ఎలా.. ఎందుకు.. ఏ అంశాలు ప్రధాన పాత్ర పోషించి ఊహించని విధంగా బ్లాక్ బస్టర్ హిట్ గా నిలబెట్టాయో మాత్రం ఖచ్చితంగా చెప్పొచ్చు. అన్నీ కరెక్ట్ గా కలిసి రావడంతో ఓ మ్యాజిక్ క్రియేట్ అవుతుంది.. అదే అనూహ్యంగా సినిమాని బ్లాక్ బస్టర్ హిట్ ని చేస్తుంది. అలాంటి మ్యాజిక్ జరిగిన బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన మూవీ డీజే టిల్లు. సిద్ధూ జొన్నలగడ్డ నటించిన ఈ మూవీ భారీ సినిమాల మధ్య ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై చిన్న సినిమాల్లో భారీ విజయాన్ని సాధించింది. ఈ సినిమా సక్సెస్ విషయంలో మ్యిజిక్ చేసిన అంశాలు చాలానే వున్నాయి. హీరో సిద్ధూ జొన్నలగడ్డ క్యారెక్టర్ ని మలిచిన తీరు సిద్ధూ జొన్నలగడ్డ అందించిన మాటలు దర్శకుడు విమల్ కృష్ణ టేకింగ్ రాధిక పాత్రలో తనదైన మార్కు నటనతో నెగెటివ్ రోల్ లో నటించిన సినిమాని కీలక మలుపులు తిప్పిన నేహా శెట్టి రామ్ మిర్యాల సంగీతం అందించి పాడిన డీజె టైటిల్ సాంగ్ తమన్ నేపథ్య సంగీతం శ్రీచరణ్ పాకాల ఆడియో.. బ్రహ్మాజీ క్యారెక్టర్.. ఇలా అన్నీ సమపాళ్లలో కలిసి మ్యాజిక్ చేశాయి. దీంతో ఊహించని విధంగా డీజే టిల్లు బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్ అనిపించుకోవడమే కాకుండా రూ. 50 కోట్ల మేర వసూళ్లని రాబట్టి ట్రేడ్ వర్గాలనే విస్మయానికి గురిచేసింది. రీసెంట్ గా దీనికి సీక్వెల్ అంటూ టిల్లు స్క్వేర్ని మొదలు పెట్టాడు సిద్ధూ జొన్నలగడ్డ. హీరో మేకర్స్ సేమ్. కానీ డైరెక్టర్ హీరోయిన్ మ్యూజిక్ డైరెక్టర్ మారిపోయారు. రాధికగా నటించి సినిమాకు ప్రధాన బలంగా నిలిచిన నేహాశెట్టి ఇందులో లేదు. తన స్థానంలో అనుపమ పరమేశ్వరన్ ని దించేశారు. తనలా అనుపమ మ్యాజిక్ చేయడం కష్టమే. ఇక దర్శకుడిగా విమల్ కృష్ణని తప్పించారు. ఆ స్థానంలో మల్లిక్ రామ్ వచ్చి చేశాడు. తన మేకింగ్ సిద్ధూ జొన్నలగడ్డతో ఎలా మింగిల్ అవుతాడన్నది కొంత అనుమానంగానే వుంది.

స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

PAY BACK TO SOCIETY SNEHA CLUB — SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob
Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046
7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989